జనవరి - 2016

# పరిశుద్ధత

ఆధ్యాత్మిక క్రైస్తవ మాసపత్రిక

ప్రధాన సంపాదకులు :

రెవ.డా॥ కె. జోసఫ్

సర్క్యులేషన్ :

సామ్రాట్ కొడవటికంటి

చందా వివరములు :

సంవత్సర చందా రూ. 150/-

పోషక చందా రూ. 1000/-

జీవిత చందా రూ. 3000/-

విడి ప్రతి రూ. 15/-

మా చిరునామా :

ఎడిటర్, పరిశుద్ధత

పోస్ట్‌బాక్స్ నెం. 28

ఒంగోలు - 523001

ఫోన్ : 08592-231281

సెల్ : 9704255416

## లోపలి పేజీల్లో...

| | | |
|---|---|---|
| సంపాదకీయం | ఎడిటర్ | 02 |
| అపొస్తలుడు | కొడవటికంటి | 03 |
| లియో టాల్‌స్టాయ్ | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 06 |
| ఒక నిరీక్షణ ఎన్ని అద్భుతాలు? | మామయ్య కథలు | 09 |
| బైబిలు చరిత్ర | ఐ.ఇ.ఆర్.యఫ్. డెస్క్ | 11 |
| మధ్యకాలము | బ్రదర్ కె. సామ్రాట్‌గారు | 14 |
| దేవుని జ్ఞానం అపరిమితమనుటకు ఉదాహరణ | ఐ.ఈ.ఆర్.ఎఫ్ డెస్క్ | 16 |
| నూతన జీవనము | రెవ.డా॥కె.జోసఫ్‌గారు | 17 |
| మరణము-నిజమా? | రెవ.ఎ.మత్తయ్య, వినుకొండ | 18 |
| సువార్తలనుగూర్చి | రెవ.డా॥ కొడవటికంటి విక్రాంత్ | 20 |
| మనసాక్షి | శ్రీమతి రిబ్కా విక్రాంత్ | 22 |
| అక్షరయజ్ఞం - బైబిల్ క్విజ్ | శ్రీమతి కె.ప్రసన్న పరాక్రమ్‌గారు | 24 |

India Evangelistic & Relief Fellowship

| EVANGELISM | RELIEF |
|---|---|
| Church Planting | Orphanage |
| Evangelestic, Crusades | Child Development Centers |
| Pastor's Seminars | Education (U.C.L.I. Schools) |
| Youth Ministry | Widows & Leprosy Care |
| T.V.Ministry | Medical Assistance |
| Magazine Ministry | Help in Natural Calamity |
| Audio Ministry | Flood Relief |
| Jail & Prison Ministry | Mobile Medical Ministry |
| IERF International | Children Care Ministry |
| Hanna Women Ministries | |

ప్రకటన రేట్లు

| | | |
|---|---|---|
| టైటిల్ 4వ పేజీ | ..... | రూ. 3,000/- |
| టైటిల్ 3వ పేజీ | ..... | రూ. 2,000/- |
| లోపలి పేజీ | ..... | రూ. 1,000/- |

# సంపాదకీయం.....



ప్రియ పరిశుద్ధత పాఠకులకు నూతన సంవత్సర శుభాకాంక్షలు.

క్రిస్మస్ సందటి ముగిసింది. నాకు ఊహ తెలిసినప్పటి నుండి క్రిస్మస్ ఎప్పటిలాగానే ఉంది. క్రైస్తవులకు సంబంధించి ఎకైక పెద్ద పండుగ కాబట్టి క్రిస్మస్ సందటి నవంబర్ నుండి మొదలై జనవరి నెలంతా ఆ వాతావరణం నెలకొని ఉంటుంది. ప్రతి ఊర్లో కూడా క్రీస్తు పుట్టుక నాటికలు వేస్తూ, పిండివంటలు చేసుకొని చాలా బాగా ఎంజాయ్ చేస్తారు. నాకు బాగా గుర్తు నా చిన్నతనంలో అందరూ గ్రీటింగ్ కార్ట్ ఇచ్చుకోవడం, బంధువుల ఇళ్ళకు వెళ్ళి పిండివంటలు ఇచ్చిరావటం జరిగేది. కానీ ఇప్పడు ట్రెండ్ మారిపోయింది. ఇప్పడు అంతా హైటెక్ పద్ధతిలో ఎస్.యం.ఎస్‌లు, ఈమెయిల్స్, ఫోన్స్‌లోనే విషెష్ చెప్పకుంటున్నారు. మనుష్యులు వ్యక్తిగతంగా కలుసుకోవడం తగ్గిపోయింది. యేసుక్రీస్తు పుట్టిన రోజు సంగతి ఏమోగానీ, అందరూ వారి స్వంత పుట్టిన రోజులాగా వేడుక చేసుకుంటున్నారు. కనీసం ఆ రోజు యేసయ్యని తలుచుకొనే వారే ఉండరు. అదీ క్రిస్మస్ కథ.

మరి నూతన సంవత్సర వేడుకలు కూడా అలానే ఉంటున్నాయి. ఎప్పడూ అదే తంతు. పేరుకే 'నూతన', కానీ అన్నీ పాత పద్ధతులే. మనుష్యుల జీవితాలు కూడా ఏమీ మారటం లేదు. ఒకవేళ ఎవరైనా 'ఈ నూతన సంవత్సరం నుండి మారాలి' అని అనుకున్నా, అది ఆ ఒక్కరోజుకే పరిమితం అయిపోతుంది. దీనంతటికీ కారణం మనం యేసులో, యేసు మనలో లేకపోవడమే. "ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" అని 2కొరింథీ 5:17లో వ్రాయబడిన ప్రకారము ఈ నూతన సంవత్సరం నుండైనా మనము క్రీస్తులో, క్రీస్తు మనలో ఉండునట్లుగా మన జీవితాలను మార్చుకుని సమాధానకరమైన జీవితము జీవించుదాము.

Wish You A Blessed New Year

-ఎడిటర్

సీరియల్

# అపొస్తలుడు

22

– కొడవటికంటి

అప్పటికి 1450 సం॥ క్రితమే యెరికో వేగు చూచుటకు వెళ్ళిన వారికి 'రాహాబు' చేసిన సహాయం ఇప్పుడు సౌలుకు అవసరమైనది. అయితే అందుకు సౌలు ఒప్పుకోలేదు. అననీయ, మరికొంతమంది శిష్యులు సౌలును బయటకు రానీయకుండా దాచి ఉంచారు. వేగులవారు సౌలు కోసం పట్టణపు వాకిండ్లు భద్రముచేసి, పట్టణంలో గాలింపు చర్యలు సాగించారు. సౌలును ముందుగా దమస్కు పట్టణం దాటించవలసి ఉంది.

"యేసు నామము నిమిత్తము మరణించడానికైనా సిద్ధమే కాని సువార్త ప్రకటించకుండా ఉండలేను" అన్నాడు సౌలు నిబ్బరంగా.

అందుకు అననీయ "ప్రభువు మమ్ములను డెబ్బై మందిని ఏర్పాటు చేసి ఆయన ప్రవేశించబోవు గ్రామములకు ముందుగా, ఇద్దరేసి చొప్పున పంపించాడు. పంపేటప్పుడు – 'మీరు నా నామము నిమిత్తము అందరిచేత ద్వేషింప బడుదురు. అంతము వరకు సహించినవాడు రక్షించబడును, వారు ఈ పట్టణములో మిమ్మును హింసించినప్పుడు మరియొక పట్టణమునకు పారిపోవుడి. మనుష్యకుమారుడు వచ్చువరకు మీరు ఇశ్రాయేలు పట్టణములలో సంచారము చేసి ఉండరని నిశ్చయముగా మీతో చెప్పుచున్నాను' అన్నాడు. కనుక నీవు ఈ రోజు ఎలాగైనా శిష్యులమాట విని వారు చేసిన ఏర్పాటు ప్రకారం ఈ పట్టణం నుండి తప్పించు కోవాలి" అన్నాడు.

సౌలులోని అహం దెబ్బతిన్నట్లుగా బాధపడ్డాడు. తప్పించుకొని పారిపోవటం అంటే–అది గొప్ప అవమానంగా తోచింది. అంతకంటే మరణించటమే మేలు అనుకున్నాడు. మరలా అననీయగారు కల్పించుకొని "ఎవడైనను నన్ను వెంబడింపగోరిన యెడల, తనను తాను ఉపేక్షించుకొని, తన సిలువ నెత్తుకొని నన్ను వెంబడింపవలెను – అని ప్రభువు మాతో చెప్పాడు.

కాబట్టి మనం అన్ని రకాలైన అవమానాలను భరించ వలసినదే! ఆ ప్రకారమే మీలో తనకు కలిగినదంతా విడిచి పెట్టనివాడు నా శిష్యుడు కానేరడు అన్నాడు. కనుక బాధపడక ఈ రాత్రి మీరు పట్టణ ప్రహరీ దాటడానికి సిద్ధంగా ఉండండి" అని చెప్పాడు.

ఆ రాత్రి మూడవజాములో కొందరు శిష్యులు సౌలును వెంట బెట్టుకొని పట్టణ ప్రహరీ గోడ మీద కట్టబడిన ఒక శిష్యుని ఇంటికి తీసుకొని వచ్చారు. అక్కడ సౌలు యొక్క వేషధారణ మార్చి పట్టణం వెలుపల నివసించే కుష్టురోగులకు ఆహారం అందించే గంపలో కూర్చుండబెట్టి క్రిందకు దించారు. తన జీవితంలో ఇంత నికృష్టపు సమయం సంభవిస్తుందని అనుకోలేదు. నజరేయుడైన యేసును–క్రీస్తుగా అంగీకరించటం ఒక విప్లవమైతే, ఆయనవలే జీవించటం ఒక సాహసం. దాదాపు రెండు వందల మైళ్ళు ఒంటరిగా, రహస్యంగా, ప్రయాణం చెయ్యాలి. 'నీవు హింసిస్తున్న యేసును అని మాట్లాడిన ప్రభువు – ఇప్పుడు విడువడు' అనుకున్నాడు.

పదిమందితో కలసి ప్రయాణం చెయ్యటం కుదరదు. తన యొక్క ధనసమృద్ధి తనను బాల్యము నుండి ఒంటరిగా బ్రతక నియ్యలేదు. తనకు దమస్కు వద్ద జరిగిన మార్పు రోజుకొక క్రొత్త జీవితానుభవమును, కొన్ని అపురూపమైన ఆధ్యాత్మిక ధన్యతలకు, కొన్ని శరీర కష్టములకు మూలమైనది.

ప్రభువు తనకు దర్శనమిచ్చిన తొలిసారి ఏమని మాట్లాడాడు? 'నేను ఈ ప్రజల వలనను, అన్యజనుల వలనను, హాని కలుగకుండా నిన్ను కాపాడుతాను' అన్నాడు కదా! ఆయన సెలవిచ్చి నెరవేర్చకుండా ఉంటాడా? ఇప్పుడు ఈ మూడు సంవత్సరాలలో జరిగినవన్నీ, ఒక గురి యొద్దకు నడిపి స్తున్నాయి.

యెరూషలేము చేరేటప్పటికి పట్టణమంతా నిద్రలో ఉంది. పేతురు గారిని కలుసుకోవాలంటే చాలాచోట్ల అడ్డంకులు. ఆయన వెంబడి ఎప్పుడు జనసమూహము, ఆయనకు ఇన్ని

వేలమంది మధ్యలో ఒంటరితనము కలుగజేయటం ఎలా?

యెరూషలేములో సాధ్యమైనంత వరకు పరిసయ్యులతో పరిచయాలు లేకుండా జీవించాలి. మూడు సంవత్సరాల క్రితం ఈ పట్టణం వదలినప్పుడు ఇక్కడున్న సభ్యులు, పరిసయ్యులలో చాలామంది ఇప్పుడు లేరు. మూడుసంవత్సరాల తన అరేబియా జీవితం, తన యొక్క వయో పరిమాణాన్ని చాలా పెంచింది. అందువల్ల తనను చాలామంది పూర్తిగా గుర్తించలేక పోయారు.

'తను స్వయంగా పరిచయాలు చేసుకోవడానికి ప్రయత్నించినపుడు శిష్యులలో చాలామంది తప్పించుకొని పోయారు. యేసు ప్రభువు యొక్క "అపొస్తులలో" చాలామంది విదేశాలలో సువార్త ప్రకటించుటకు విదేశాలకు ప్రయాణమై పోయారు.

ఆ రోజు సాయంకాలం ఆరుగంటలకు రీఫత్ కోసం బెత్లేహేము మార్గంలో నడక సాగించాడు. యెరూషలేముకు దక్షిణదిశలో పట్టణపు గోడ దాటగానే కనబడింది – రీఫత్ నివాసం. రీఫత్ తన నివాసంలో పడక కుర్చీలో విశ్రాంతిగా కూర్చొని ఉన్నాడు. సౌలును చూడగానే ఒక్కసారి ఉలిక్కి పడినట్లుగా కనిపించాడు. కాని వెంటనే అమితమైన సంతోషంతో కుర్చీలో నుంచి లేచి, సౌలును కౌగలించుకొని, సౌలు కండ్లలోకి తృప్తిగా చూసాడు.

సౌలును కుర్చోమని తనుకూడా కూర్చున్నాడు. కాని అసాధారణమైన రీతిగా ఉన్న రీఫత్ శరీర కదలికలు సౌలు గమనించాడు.

"ఆరోగ్యం బాగాలేదా?" అన్నాడు సౌలు.

"ఇప్పటినుండి కాదు. ఆ రోజు దమస్కు వద్ద – ఆ వెలుతురు వలన నేలమీద పడిన వారందరు మరలా ఎన్నడు ముందున్న విధంగా లేరు" అన్నాడు.

"అంటే?" – అన్నాడు సౌలు ఆశ్చర్యముగా.

"ఆ రోజు ఆకాశం నుండి మనచుట్టూ ప్రకాశించిన, వెలుతురులో నీకండ్లు మాత్రం పనిచెయ్యటం మాని వేశాయి. కాని మిగిలిన వారందరికి వైద్యులకు అర్థం కాని అనారోగ్యం అంటుకున్నది. నిన్ను దమస్కులోని యూదా ఇంటిలో దించిన తర్వాత తిరుగు ప్రయాణమై, పరిసయ్యులకు, ప్రధాన యాజకులకు దమస్కు వద్ద సంభవించిన సంగతులు వివరిస్తుంటే ఎవరికి అర్థం కాలేదు. తర్వాత వేరొక స్నేహితునితో కలసి దమస్కు వస్తే అక్కడ ఒకరైనా మీ జాడ చెప్పలేదు" అని వివరించి చెప్పాడు.

ఈ మూడేండ్ల తర్వాత సౌలు కనిపించేంత వరకు సౌలు యొక్క శత్రువులు ఎవరైన అతన్ని హత్య చేసి ఉండవచ్చు అనుకున్నాడు రీఫత్. తనలోని శక్తి రోజురోజుకు నీరసిల్లుతున్నట్లుగా తెలుసుకున్నాడు. తనతో దమస్కు ప్రయాణం చేసిన బంట్రౌతులు అందరు తన స్థితిలోనే ఉన్నట్లుగా తెలుసుకున్నాడు. సౌలుకు యేసు శిష్యుని ద్వారా చూపు తిరిగివచ్చి సంపూర్ణమైన ఆరోగ్యం కలిగినదని తెలియదు. అందువల్ల మళ్ళీ చూస్తామనే ఆశ కూడ లేకుండినది. "అలా జబ్బునపడిన బంట్రౌతులలో కొందరు నజరేయుని మార్గంలో చేరిన తర్వాత స్వస్థపడినారు" అని సౌలుతో చెప్పాడు.

సౌలు ఆశ్చర్యపోతూ "బంట్రౌతులు కూడానా?" అని అడిగాడు.

"బంట్రౌతులే కాదు, యాజకులలో అనేకులుకూడ యేసుని శిష్యులుగా మారారు" అన్నాడు.

తర్వాత సౌలు తన మూడు సంవత్సరాల అరేబియా జీవితం గురించి, రీఫత్‌తో మాట్లాడాడు. అందులో సగం మాత్రమే రీఫత్‌కి అర్థం అయింది. అయినా అర్థం కాని వాటిని గురించి సౌలును ప్రశ్నించలేదు. అంతా విని –

"అయితే ఇక యెరూషలేములో రబ్బీగా ఉండరా? మీకు సభ సభ్యత్వం ఉండదా?" అన్నాడు.

"పాతవి – గతించినవే!" అన్నాడు సౌలు.

"ఇప్పుడు ఏమి చెయ్యాలని అనుకొంటున్నారు?" అడిగాడు రీఫత్.

"బర్నబా!.............." అన్నాడు సౌలు.

రీఫత్‌కి అర్థమైంది. విధాన నిర్ణయంలో బర్నబా ఒక్కడే తగినవాడు. తర్వాత కర్తవ్యం బర్నబాని పిలుచుకొని రావాలి. 'యేసు శిష్యుల హంతకుడని' పేరు పొందిన

సౌలును ఇప్పుడు ఎవరూ విశ్వసించరు అనుకొని, చిన్నగా లేచి, సౌలుకు కొంచెం ద్రాక్షారసం తెచ్చియిచ్చాడు. తర్వాత ఇద్దరు కలసి బర్నబా ఇంటికి బయలుదేరారు.

అప్పటికే రాత్రి బాగా ప్రొద్దుపోయింది. ఇద్దరూ కలసి బర్నబా గారింటికి బయలుదేరారు. అక్కడక్కడ రోమా సైనికులు ఎదురువచ్చారు. నేరుగా ఉత్తరదిశగా ప్రయాణం చేస్తే బర్నబాగారి ఇల్లు వస్తుంది. కాని దారిలో మిల్లోకోట నాటకశాల దేవాలయపు తూర్పు గోడదాటి, కయపగారి ఇంటి మీదుగా వెళ్ళాలి. ఇప్పట్లో ప్రధాన యాజకునికి కనబడుట ఇష్టం లేక తూర్పుగా తిరిగి మక్కబీయుల మందిరం దాటి హేరోదు మందిరము మీదుగా బర్నబాగీరి ఇంటి వెనుక వైపుకు చేరారు. ఉత్తరం వైపు ప్రహారీ దాటి అప్పుడే ఇంట్లోకి ప్రవేశిస్తున్న బర్నబా వీరిద్దరిని గమనించి వెనుక ద్వారమును ఆనుకున్నాడు. సౌలును చూచి కొంచెం నిర్ఘాంతపోయాడు. దమస్కు దగ్గర ప్రభువు సౌలును దర్శిం చాడని, తర్వాత సౌలు ప్రభువును గుర్తించాడని విని బర్నబా సంతోషించాడు. తర్వాత సౌలు యొక్క జాడ తెలియక పోవడంతో మనుష్యులు సౌలును దాచియుండ వచ్చును అనుకున్నాడు. అతని కొరకు ఎంతగానో ప్రభువును ప్రార్థించాడు.

పేతురుగారితో గాని, మూల స్థంభములుగా ఎంచబడిన యాకోబు, యోహానులతోగాని, సౌలు సంగతి ప్రస్తావించ లేదు. ప్రభువు సౌలును కనికరించి, రక్షణలోని నడిపించిన విధంగానే సంఘం యొక్క క్షేమాభివృద్ధికై అతనిని మరలా సంఘానికి అప్పగించుతాడని నమ్మాడు. అయితే రెండు సంవత్సరాల తర్వాత సౌలు సంగతి మరచిపోయాడు.

ఈ రోజు తలవని తలంపుగా కన్నుల యెదుట నిలిచి యున్న సౌలుని చూచి సంభ్రమాశ్చర్యాలతో ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు. పరుగెత్తుకుంటూ వెళ్ళి సౌలును గట్టిగా కౌగలించుకున్నాడు. బర్నబా యొక్క స్పర్శ సౌలులో అనిర్వ చనీయమైన అనుభూతిని కలిగించింది. తన ప్రాణ స్నేహి తుడే కాని, ఇప్పుడు ఆధ్యాత్మికమైన బంధువు, రక్తసంబంధి కన్నా చేరువైన వాడుగా కనిపించాడు. ప్రభువును ఎరిగిన తర్వాత ఇది మొట్టమొదటి అనుభవం. ఇది అనుభవించిన వారికే పరిమితం అనుకున్నాడు.

భోజనమైన తర్వాత సౌలు తన దమస్కు ప్రయాణంలో జరిగిన అనుభవము, దమస్కులో బాప్తిస్మము, అననీయ గారి సహవాసం మరలా యెరూషలేము ప్రయాణము అంతా చెప్పాడు. కాని తన అరేబియా అనుభవం గూర్చి చెప్పలేదు. ఎందుకంటే అది తనకు మాత్రమే ప్రభువు స్వయంగా ఇచ్చినది. అది ఇతరులకు, భక్తులకైనను అర్థం కాదు. ఎందుకంటే అది తన కొరకు మాత్రమే నిర్దేశించ బడింది.

ఆ రాత్రి సౌలుకు స్వచ్ఛమైన నిద్రపట్టింది. తార్సు నుండి తను యెరూషలేముకు ప్రయాణమైన తర్వాత ఇంత మంచి నిద్రను తను చవిచూచి యుండలేదు అనుకున్నాడు. తను నిద్రలేచేసరికి బర్నబా శిష్యుల వద్దకు వెళ్ళినట్లు తెలిసింది. రీఫత్ తన ఇంటికి వెళ్ళిపోయాడు. తను ఇక చేసేదేమి లేదు, బర్నబా కొరకు ఎదురు చూడటమేనని అనుకొని దినకృత్యములలో మునిగిపోయాడు. అరగంట తర్వాత మేడగదిలోకి వచ్చేటప్పటికి మార్కు గది అంతా శుభ్రంచేసి ఫలహారముతో సిద్ధంగా ఉన్నాడు.

సౌలుకు మార్కును చూస్తే చాలా సంతోషంగా ఉంది. ఫలహారం తీసుకుంటూ "నజరేయుడైన యేసు నీకు తెలుసా?" అని అడిగాడు.

ఆ పేరు విన్నంతనే యోహాను ముఖం వికసించింది.

"ఔను! బాగా తెలుసు. ఆయన తరచుగా ఈ మేడగది లోనే విశ్రాంతి తీసుకొనేవాడు" అన్నాడు.

"సిలువ ఎక్కక ముందు రాత్రి ఈ గదిలోనే ఆయన చాలాసేపు ఉన్నాడు తన శిష్యుల పాదాలు కడిగాడు. చాలా దుఃఖముతో పెద్ద ప్రార్థన చేశాడు. చాలా విషయాలు మాట్లా డాడు. తర్వాత ఈ గదిలోనే ఒక కీర్తన పాడి, గెత్సెమనే వనానికి వెళ్ళారు. అక్కడ ఆయనను బంధించడానికి యూదా సైన్యంతో వచ్చాడు" అని తన పాత అనుభవాలు స్మరణకు తెచ్చుకుంటున్నాడు

**(సశేషం)**

# నా స్వప్నము

## (లియో టాల్‌స్టాయ్)

తన ఇరవై అయిదవ సంవత్సరములో తన జీవిత మంతా శూన్యంగా అనిపించింది. ఈ బంగళా – ఇక్కడికి వచ్చే ధనవంతులు వారి నివాసజీవితాలు అహంబావికులు అంతా శూన్యముగా అనిపించారు. సంవత్సరాలు గడిచే కొలది ఈ విలాసవంతమైన జీవితం రాజదర్బారులో వారు పలికే ప్రగల్భాలు, సాయంసమయ డాన్సులు యువకులు వృద్ధులు కూడా బాహ్యప్రతిపాదనలే చేసారు. అందరి హృదయాలు శూన్యమే అని తెలుసు. విలువైన విషయాలు ఏదీ కనిపించలేదు. చివరికి సంగీతము కూడా సొంపుగా అనిపించలేదు. కథల పుస్తకాలు చదివిన జీవితములో సమస్యలను గురించి చెప్పారేమో అనుకుంటే, వాటిని ఎదుర్కొనే విషయాలు చెప్పబడలేదు. అలా రెండుమూడు సంవత్సరాలు గడిచిపోయాయి. జీవితం మీద విరక్తి కలిగింది. చనిపోవాలనిపించేది.

దానధర్మాలు చేస్తే మనసు నెమ్మది అన్నారు. కాని దానధర్మాలు చేసేవారంతా వారికి మిగిలిందే ఇస్తున్నారు. గొప్ప కొరకు ఇస్తున్నారు కాని హృదయానందం పొందలేక పోతున్నారని గుర్తించింది. నిజమైన జీవితాన్ని జీవించేవారు ఎవరు కనబడలేదు.

తన జీవితంలో మాధుర్యం అనిపించిందల్లా తన కంటే చిన్నపిల్లవాడైన "కోక" దగ్గరే. అతను యదార్ధపరుడు. నిజాయితీగా మాట్లాడేవాడు. అతను వెళ్ళిపోయిన తర్వాత జీవితమంతా నిరాశనిస్పృహలే. అటువంటి పరిస్థితులలో ఫిన్‌లాండ్‌లోని ఆంటి దగ్గరకు వచ్చింది. ఆ క్రొత్తదనము, క్రొత్త మనుష్యులు. తన తండ్రి ఇంటి వద్ద ఉన్న పరిస్థితులకు వ్యతిరేకముగా ఉండి, తనకు ఎంతో ఆహ్లాదకరముగా అనిపించింది.

ఇదంతా ఎలా జరిగిందో చెప్పలేము కాని ఆ ఆంటి ఇంట్లో మరొ స్వీడెన్ దేశీయుడు ఉన్నాడు. అతను తన పని విషయం, తన ప్రజల విషయం ఇంకా అతను చదువుతున్న కొత్త స్వీడన్ నవల విషయం చెబుతుండేవాడు. మరి ఎలా జరిగిందో తెలియదు కాని నవ్వులు, కండ్లతో మాట్లడుకోవడం, విడువలేని అనుబంధము వలె నిలిచిపో సాగాయి. ఈ ధరిత్రిలో మనకు తెలియని భావాలు ఒక్కో సారి అవే బయటికి వస్తాయి. ఎలా వచ్చాయో, మనల్ని ఎలా వశపరచుకున్నాయో చెప్పలేము.

అతనితో మాట్లాడే ప్రతిమాట, ఎంతో మృదువుగా ఉండే పాటలు కూడా కలిసి పాడుకొనే వరకు వచ్చింది.

మాటలు ఆగిపోయిన తర్వాత కండ్లు మాటలాడు కోవడం ప్రారంభించాయి. కండ్లు మనసులను మనుష్య లను ముడివేయగలవు. వారికి కనపడని కళ్ళు వారిని బంధించాయి. ఆమె మొదట్లో భయపడింది. ఏడ్చింది. ఆ బంధకాలను తప్పించుకోవాలనుకొనే కొలది అవి మరీ బలపడ్డాయి. ఓడిపోయి అతని ఒడిలో పడిపోయింది. తనకు తల్లి ప్రేమ తెలియదు. తండ్రి తనను దూరంగా ఉంచాడు. తనలోని ప్రేమాభిమానాలు ఇక్కడ మరొకరి మీదకు ప్రవహించాయి. కాని రోజులు గడిచేకొలది అతనిలో తను కోరుకొనినవేమీ కనిపించలేదు. అయినా అలానే అతుక్కుపోవాలని పించింది. కాని అతను దూరం కాసాగాడు.

ఒకరోజు అతను వచ్చాడు. అతని కండ్లలోకి చూసి నవ్వింది. నేనేమి భయపడడం లేదు. ఏ పరిస్థితినైనా ఎదుర్కొనగలను అన్నట్లు నవ్వింది. కాని తన హృదయంలో ఇక పరిస్థితులే లేవు అనుకున్నది. అతని వద్ద తాను ఆశించినదేది లేదని గ్రహించింది. "మీ తల్లిదండ్రులతో మన పెండ్లి విషయం మాట్లాడు" అన్నది. అతను "సరే"

అన్నప్పటికి అది సహజముగా లేదు.

,మరునాడు దాటిన తర్వాత అతని వద్దనుండి జవాబు వచ్చింది. తన తండ్రితో వివాహ విషయం మాట్లాడడం సాధ్యము కాదు ఎందుకంటే తనకు ఇంతకుముందే వివాహము జరిగిపోయింది. భార్య తన నుండి దూరంగా వెళ్ళిపోయింది అని వ్రాశాడు. అతను మరలా వచ్చినపుడు తను అన్నిటికి సిద్ధపడి ఉన్నానని, నీకు వివాహము అయినా నిన్ను విడువనని చెప్పింది. మేము చాలా బీదవారము. నిన్ను సుఖపెట్టలేనన్నాడు.

"నేను ప్రతి సమస్యకు సానుకూలముగా ప్రవర్తిస్తాను కాని ఇలా నెలలో రెండుమూడు సార్లు మనం కలుసు కొనేకంటే బీదరికమే మంచిది. కనుక నన్ను ఇక్కడనుండి తీసుకొనివెళ్ళు" అని వ్రాసింది.

తర్వాత లీసా తన చిన్ననాట గడిపిన పీటర్స్‌బర్గ్ వచ్చింది. అతను త్వరలో వచ్చి కలుసుకుంటానని ఉత్తరం వ్రాశాడు. ఇక అదే ఆఖరి ఉత్తరం.

ఇప్పుడు త్వరలో తను తల్లి కాబోతున్నదని తెలుసు కున్నది. ఈ భావనేదో తన అంతరాత్మలోనికి తొంగిచూసు కున్నది. ఇతరులు తనను ఏమనుకుంటారో అనే దానికంటే తన జీవితాన్ని తానే పరీక్షించసాగింది. ఇతరులు ఏమను కుంటారో అనుకొని, చావడం తేలికే! తను ఈ ప్రపంచానికి వ్యతిరేకము కనుక తనే ఈ లోకంలో నుండి వెళ్ళిపోవాలను కుని ఆత్మహత్య కు ఆలోచించింది.

ఒకరోజు తన పరుపు కుట్టుకుంటూ తన తల్లి బాధ్యతా రహిత జీవితం, తన తండ్రి ప్రేమను గురించి ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది. తను ఆత్మహత్య చేసుకోవడం అసాధ్యము అనుకున్నది. అన్ని ఆలోచిస్తూ చాలాసేపు గడిపింది. చివరికి అన్ని మరిచిపోవాలంటే విముక్తి పొందాలంటే ఆత్మహత్య శరణ్యం అనుకున్నది.

మరలా తన తండ్రి గుర్తుకువచ్చాడు. తన ఆత్మహత్య ఆయనను ఎంత కృంగదీస్తుందో అని ఆలోచించింది. తన చేతిలోని విషం సీసాను గిరాటు వేసింది. తను నడిచివచ్చిన దారి, దానిలోని జ్ఞాపకాలను మర్చిపోవడానికి ప్రార్థించడం మొదలుపెట్టింది. అయినా తన ప్రార్థన తనకు నెమ్మది కలుగజేయలేదు. తన ఈ నరక బాధకంటే తనను గురించి తన తండ్రి పడే బాధ చాలాగొప్పది అని గ్రహించింది. ఆత్మహత్య విషయం ఆలోచించడం మాని ఈ పట్టణం నుండి తనను ఎవ్వరూ గుర్తించని మరో మారుమూల గ్రామానికి వెళ్ళిపోవాలని ఆలోచించసాగింది. అక్కడ తన బిడ్డతో దుఃఖకరమైన భారమైన జీవితాన్ని గడపాలి అనుకున్నది. ఇప్పటికి నాలుగు నెలల నుండి ఒక మంత్ర సాని ఇంట్లో నివశిస్తు అనుకోకుండా తన పెదనాయన తన వద్దకు వస్తున్నట్లుగా గ్రహించింది. కనుక తను త్వరగా ఇక్కడి నుండి వెళ్ళిపోవాలని తయారైంది.

మరుసటి రోజు ఉదయాన్నే మైకెల్ సిద్ధపడ్డాడు. తన అన్న గదిలోకి వెళ్ళి తన కుమార్తె పోషణ కొరకై వ్రాసిన చెక్కును ఆయనకు ఇచ్చాడు. సాయంకాలము తన అన్న వెళ్ళే సమయానికి ఆయన ఇక్కడ చేయవలసిన పనులన్ని ముగించుకోగలడు అని నిశ్చయానికి వచ్చి టిఫిన్ చెయ్య డానికి భోజనశాలకు వచ్చాడు. అక్కడ తన వదిన ఉన్నది. ఆమెతో ఏమి మాట్లాడలేదు. కాని ఆమె భయం భయంగా తనవైపు చూస్తున్నదని గ్రహించాడు. బయటకు వచ్చాడు.

అతని వదిన అతని వెంబడి బయటకు వచ్చింది. "దగ్గరలో ఉన్న పార్కులోకి వెళ్ళు మైకెల్ అక్కడ చాలా ఆహ్లాదకరంగా ఉంటుంది. ఆ పార్కు అన్నింటికి దగ్గరే" అన్నది జీరపోయిన గొంతుతో.

ఆమె చెప్పినట్లుగానే పార్కుకు వెళ్ళాడు. అక్కడ కూర్చొని కొంచెంసేపు ఆలోచించాడు. మా వదినకు నామీద కొంచెం కూడా జాలిలేదు అనుకున్నాడు. నా దుఃఖాన్ని కొంచెం కూడా ఆమె గ్రహించలేదు. ఆమెతో నాకేమిటి అనుకున్నాడు. తర్వాత లీసా గుర్తుకువచ్చింది. ఈ వయస్సులో నాకు ఇంత దుఃఖము కలుగజేసింది. ఈ దుఃఖము నా జీవితాన్ని కుదించి వేస్తుంది. తన కుమార్తెను గురించి పట్టణస్తులు మాట్లాడుకొనే విధానాన్ని ఆలోచించినపుడు అతనిలో క్రోధము పెరిగింది. కాని అప్పటికే అందరికి తెలిసి పోయిందని అతనికి తెలియదు. తన క్రోధాన్ని లీసా

మెదడులోకి పంపించి తన స్థితిని కొంత మెరుగుపరచు కోవచ్చును అనుకొన్నాడు. తను ఇంటినుండి బయలు దేరేటప్పుడు తన వదిన ఈ పార్కు అన్నింటికి దగ్గరే అనిన ఆ మాట గుర్తుకు వచ్చింది. తన కుమార్తె లీసా ఇక్కడికి దగ్గరలో నివశిస్తుంది అని జేబిలో నుండి చిన్న అడ్రసుల పుస్తకం బయటకు తీసి ఆ అడ్రసు సిల్వర్ స్టోవాకుకోనక్యా వీధి, అబ్రానోల్ ఇల్లు. ఈ పేరు మీద లీసా ఇప్పుడు నివశిస్తున్నది అని పుస్తకం జేబిలో పెట్టుకొని అటు వెళ్తున్న టాంగాని పిలిచాడు.

ఆ ఇంటి వద్ద టాంగా దిగి తలుపుతట్టాడు. మంత్రసాని వచ్చి "మీకెవరు కావాలి?" అని అడిగింది.

"సిల్వస్టోన్ ఇక్కడ నివశిస్తున్నదా?" అని అడిగాడు.

"ఆమె ఇప్పుడే ఈ మూలనున్న దుకాణం వద్దకు వెళ్ళింది. ఒక నిమిషంలో వస్తుంది. దయచేసి లోపలికి వచ్చి కూర్చోండి" అన్నది.

ఆప్రక్కనే ఉన్న కుర్చీలో కూర్చున్నాడు. ప్రక్క గదిలో నుండి చిన్నపిల్లవాని పెద్ద ఏడుపు వినిపించింది. ఆ ఏడుపు అతని కడుపులో దిగిన కత్తివలె అనిపించింది. మారియా – ఆ మంత్రసాని గబగబ ఆ గదిలోకి వెళ్ళి ఆ బిడ్డను జోకొట్టింది. బిడ్డ నిద్రపోయినట్లుంది.

మారియా బయటికి వచ్చి "ఆ బిడ్డ ఆమెది.." అని మైకెల్‌ను చూసి "ఇప్పుడే వస్తుంది. మీరు ఆమె స్నేహితులై యుంటారు" అంటూ తన గదిలోకి వెళ్ళింది.

"ఔను స్నేహితుడనే!"ని అని లేచి "నేను తరువాత వస్తే బాగుంటుందేమో"ని అని బయటకు నడువబోయాడు. ఇప్పుడు ఈ పరిస్థితులలో లీసాను కలవడం మంచిది కాదేమో అనుకొని వస్తుంటే లీసా స్వరము వినబడింది.

"మారియా! నేను బయటకు వెళ్ళినపుడు బిడ్డ ఏడ్చాడా?" అని తలతిప్పి తన తండ్రిని చూసింది. ఆమె చేతిలోని ప్యాకెట్ క్రింద పడిపోయింది. "నాన్నా!" అని ఏడ్చి వణికి పోతుంది. మైకెల్ నిశ్చలంగా నిలబడిపోయాడు.. ఆమె సన్నగా అయిపోయింది. ఏమి చెయ్యాలో ఏమి మాట్లాడాలో అర్ధం కాలేదు. తనకు జరిగిన అవమానము అతనికి గుర్తు రాలేదు. ఆమెను చూడగానే దుఃఖము కలిగింది. ఆమె సన్నగా ఉందని దుఃఖము కలిగింది. ఆమె ధరించిన ముతక గుడ్డలను చూసి దుఃఖము కలిగింది.

"నన్ను క్షమించు నాన్న!" అంటూ ఏడుస్తూ దగ్గరగా వచ్చింది. "క్షమించు! క్షమించు" అంటూ ఏడుస్తూ ఆమెను కౌగిలించుకొని ముఖం చేతులు కండ్లు ముద్దుపెట్టుకొని తన కన్నీళ్ళతో తడిపివేశాడు.

ఆమె మీద జాలితో తనను తాను తెలుసుకున్నాడు. తను ఎట్లున్నాడో, ఆమె ఎడల తన హృదయం ఎలా ఉండినదో, తన అహంకారము వలన, కోపము వలన తన హృదయంలో ఎంత తప్పుచేసాడో గ్రహించాడు. తను ఆమెను క్షమించడం కాదు గాని తన కుమార్తే క్షమించాలి. తన చిన్న గదిలోకి తన తండ్రిని తీసుకొని వెళ్ళింది. తన బిడ్డ విషయం తను ఏమి మాట్లాడలేదు. కాని తను ఎలా బ్రతుకుతున్నదో చెప్పింది.

"ఈ ఊర్లో ఉంటానో లేదో ఇంకా నిశ్చయించుకోలేదు" అని చెప్పింది.

"ఆ విషయం తరువాత మాట్లాడుదాము" అని ఆయన అంటుంటే బిడ్డ ఏడ్వడం మొదలుపెట్టాడు. లీసా తన తండ్రి ముఖంలోకి చూస్తూ అలానే నిలబడిపోయింది.

"ఇప్పుడు బిడ్డకి పాలివ్వాలేమో అమ్మా!" అన్నాడు.

ఆమె అటు బిడ్డవైపు తిరిగింది. ఇప్పుడు తను ప్రాణంగా చూసుకొనే తన బిడ్డను తండ్రికి చూపించాలా? అనే ఆలోచన మెరిసింది. తన తండ్రిని చూసింది. ఆయన బిడ్డ విషయంలో కోపంగా ఉన్నాడా? కాని ఆయన ముఖంలో కోపం కనిపించలేదు. కాని విచారం కనిపించింది.

"సరే వెళ్ళు, వెళ్ళమ్మా! రేపు నేను మరలా వస్తాను. అప్పుడు ఆలోచిస్తాను అమ్మడూ! వెళ్ళివస్తాను"ని అని ఇంక ఏదో అనబోతే గొంతులో కఫం అడ్డం వచ్చింది.

తన అన్న గదికి రాగానే ఆయన గబగబ మైకెల్ వద్దకు వచ్చాడు.

"మంచిది" అన్నాడు.

"మంచిదే – ఏమి జరుగలేదు" అన్నాడు మైకెల్.

# ఒక నిరీక్షణ ఎన్నో అద్భుతాలు

ఒక ఆపిల్ చెట్టుకి ఉన్న రెండు ఆప్లిల్స్ ఇలా మాట్లాడు కుంటున్నాయి. చిన్న ఆపిల్ పెద్ద ఆపిల్ వైపు ఒకసారి అలా చూసి “నాకు చెట్టు మీద నుండి పడిపోవాలని లేదు, నీకు తెలీదా కింద ఎంత గట్టిగా, మురిగ్గా ఉంటుందో, మరలా నేలంతా పురుగులుంటాయి. కావాలంటే నువ్వే చూడు కిందపడ్డ ఆపిల్స్ అన్నీ ఎలా కుళ్ళిపోతున్నాయో” అంది

అప్పుడు ఆ పెద్ద ఆపిల్ ఒకసారి కిందకి చూసి ఆలోచించి ఇలా చెప్పింది “నువ్వు కింద వడటం గురించి బాధపడుతున్నావా. కానీ చాలామంది మనుష్యులకి ఉపయోగ పడేవన్నీ నేలనుండే వస్తాయి'' అంది.




అప్పుడు ఆ చిన్న ఆపిల్ కోపంగా “కానీ అలా జీవించటం నాకు ఇష్టం లేదు. నా ఆలోచన వేరు. నన్ను ఒక మంచి కుటుంబం కోసుకొని వాళ్ళ డైనింగ్ టేబుల్ మీద అందమైన గిన్నెలో ఉండాలని ఉంది. నేనే మిగిలిన పండ్లన్నిటి కంటే అందంగా ఉంటాను. ఎందుకంటే నాకు అందమైన మెరిసే ఎర్రని తోలు ఉంటుంది” అంది.

అప్పుడు ఆ పెద్ద ఆపిల్ “ఆ ఎర్ర తోలే కాదు ఇంకా ఆపిల్ వల్ల చాలా ఉపయోగాలున్నాయి” అంది.

“అవును నాకు తెలుసు. కొంతమంది పిల్లలు నన్ను బడికి తీసుకెళ్ళు తింటారు. ప్రతి ఒక్కరికి తెలుసు నా అందం కంటే నాలో చాలా ఉపయోగాలుంటాయని. అందరూ నన్ను వాళ్ళ ఆరోగ్యం బాగుండటానికి తింటారు” అంది చిన్న ఆపిల్.

అప్పుడు ఆ పెద్ద ఆపిల్ “అవును, నువ్వు ఇవ్వగలవు కానీ ఒక ప్రత్యేకమైన నెలలోనే, అదే నువ్వు కాసే సమయంలోనే” అంది.

అప్పుడు మళ్ళీ ఆ చిన్న ఆపిల్‌కి ఒకటి గుర్తుకొచ్చింది. “ఎందుకు అందరూ నన్ను తిని నా విత్తనాలను చెత్తబుట్టలో వేస్తారు. ఎందుకని” అని బాధగా అంది.

అప్పుడు ఆ పెద్ద ఆపిల్ “అదే నేను నీకు చెప్పాలని అనుకుంటున్నాను. నువ్వు ఒక నిమిషం నిశ్శబ్దంగా ఉంటే చెప్తాను” అంది.

“తొందరగా చెప్పు, మళ్ళీ గాలి వస్తే మనం పడి పోతాం” అని భయంగా అంది చిన్న ఆపిల్.

అప్పుడు పెద్ద ఆపిల్ “ఎప్పుడైతే గాలి వస్తుందో అప్పుడు చెట్టు ఊగి నువ్వు కింద పడిపోతావు. నువ్వు చితికిపోకుండా నీ ఎర్రని తోలు కాపాడుతుంది. అప్పుడు ఏ ఉడతో లేకపోతే పక్షిగానీ వచ్చి తింటాయి. నువ్వు వాటి కడుపు నింపుతావు. నీ విత్తనాలన్నీ అవి కింద నేలమీద వదిలేస్తాయి. అప్పుడు నీ అసలైన పని మొదలవుతుంది” అని అంది.

“ఇది ఇంకా ఛండాలంగా ఉంది. ఇదేమంత బాగా లేదు” అంది చిన్న ఆపిల్ కోపంగా.

“నువ్వు ఎప్పుడైతే నేలమీద పడతావో అప్పుడు నీవు

మట్టిలోకి కరిగిపోతావు. అప్పుడు నీ విత్తనాలు భూమిలోకి వెళతాయి. ఒక సమయంలో అవి సూర్యకిరణాలు, వర్షం ద్వారా అవి చిగురిస్తాయి. అప్పుడు ఆ చిగురు నుండి ఒక చెట్టు వస్తుంది. దాని నుండి ఒక ఆపిల్ వస్తుంది. అంటే నీ సొంతగా నువ్వు కూడా ఇంకో ఆపిల్‌ని ఇవ్వొచ్చు. ఆపిల్స్ కాసే సమయంలో నువ్వు వందకు పైగా ఆపిల్స్ ఇవ్వొచ్చు తెలుసా? చూశావా నువ్వు ఎన్ని అద్భుతాలు చేయగలవో?" అంది పెద్ద ఆపిల్.

అప్పుడు ఆ చిన్న ఆపిల్ "చాలా బాగుంది" అంది.

గాలి వీచినప్పుడు ఆ రెండు ఆపిల్స్ మేము కింద నేల మీద పడాలని అని కోరుకున్నాయి. అలానే కిందపడ్డాయి. వాటి జీవితం ఒక ముఖ్య ఉద్దేశ్యంతో అప్పుడు ప్రారంభమయ్యాయి.


మన జీవితాలు కూడా ఆ ఆపిల్స్‌లాంటివే. మనం కూడా మన జీవితాలకి ఎంతో విలువ ఇచ్చుకొని మన కోరికలు తీరితే చాలు అనుకుంటాము. మన పట్ల మనకున్న ఆలోచనలు మంచివే. కాని దేవునికి మన పట్ల ఇంకా మంచి ఉద్దేశాలు, మంచి ఆలోచనలు ఉన్నాయి. మనం నిరీక్షణతో ఎదురు చూస్తే ఆయన మనకి ఏం సమాధానమిస్తాడో ప్రార్థిస్తూ ఎదురుచూడాలి.

మన చుట్టూ ఎన్నో విషయాలు మనల్ని ఆకర్షించేవి. కాని అవి కొంతకాలమే మనతో ఉంటాయి లేక మనం మనకి దేవుడిచ్చిన టాలెంట్, సమయం వల్ల వచ్చే డబ్బుని యేసుప్రభువు మహిమార్థమై ఉపయోగించాలి. అప్పుడే మనం అనుకున్న గురిని చేరగలము. కాని ఏది యేసు ప్రభువు లేకుండా సాధ్యం కాదు. ప్రార్థనతో వాక్యముతో మనం వాటిని జయించగలము. అంటే మన గురి యేసే.

## పాఠకులకు గమనిక

**'పరిశుద్ధత'** మాసపత్రికను మీరు ఎంతగానో ఆదరిస్తున్నందుకు మీకు మా కృతజ్ఞతలు. పత్రిక కావాలని అనేకమంది ఉత్తరాల ద్వారా, ఫోన్స్ ద్వారా అడుగుతున్నారు. "మీ పత్రిక ఫలానా చోట చూశాము. మీ పత్రిక చాలా బాగుందండీ, మా అధ్యాత్మిక జీవితానికి ఎంతో మేలుకరంగా ఉంది. దయచేసి మాకు కూడా పంపండి. మేము చందా కడతాము" అని అడుగుతున్నారు. అలా అడిగిన వాళ్ళందరికీ పంపాలంటే ఇప్పుడు చందా కట్టకుండా ఉచితంగా పత్రిక పొందుతున్న వాళ్ళందరికీ ఆపాలి. అందుకనే గత నెలలో పత్రికతో పాటు "పత్రిక కావాలా? వద్దా?" అనే విషయం పోస్ట్‌కార్డ్ ద్వారా తెలియజేయమని పోస్ట్‌కార్డ్ పంపించాము. అందువలన పోస్ట్‌కార్డ్ తిరిగి మాకు పంపని వాళ్ళందరికీ వరుసక్రమంలో పత్రిక ఆపివేయబడుతుంది. పత్రిక కావలసిన వాళ్ళు ఫోన్‌ద్వారా కాని, పోస్ట్‌కార్డ్ ద్వారా కాని తెలియజేయగలరు. నేటి పరిస్థితులలో పత్రిక నిర్వహణ చాలా వ్యయప్రయాసలతో కూడుకొని ఉన్నప్పటికీ, కేవలం విశ్వాసము ద్వారానే ఈ పత్రిక నిర్వహించగలుగు తున్నాము. అయితే పాఠకులు చందా కట్టడం తమ బాధ్యతగా గుర్తించాలి. ఎందుకంటే మీరు చందా కట్టటం వలన ఇంకా అనేకమందికి పత్రిక పంపడానికి సాధ్యమవుతుంది. సంవత్సరమంతటికీ కలిపి కేవలం 150/- రూపాయలు అన్నది ఎన్నతగినది కాదు. కావున పాఠకులు సహృదయముతో ఆలోచించి చందా కట్టవలసినగా ప్రభువు పేరట వేడుకొనుచున్నాను.

**- ఎడిటర్**



# బైబిలు చరిత్ర

సేకరణ: రెవ.డా॥ కె.జోసఫ్

**ఆమోసు**-పరిచయం

బైబిల్లోని ప్రవక్తల సందేశాల్లో అత్యంత వివరంగా కనిపించే సందేశం ఆమోసు ప్రవక్త సందేశమే. ఆమోసు యూదా రాజ్యానికి చెందినవాడైనప్పటికీ అతను క్రీస్తు పూర్వం ఎనిమిదవ శతాబ్దపు మధ్య కాలంలో ఉత్తర రాజ్యమైన ఇశ్రాయేలు ప్రజల నుద్దేశించి ప్రవచించాడు. ఆమోసు కాలంలో దేశం సుభిక్షంగా ఉన్నప్పటికీ దేవునిపట్ల ప్రజలు భయభక్తులు చూపినప్పటికీ వాస్తవానికి కొద్దిమంది ధనవంతులు మాత్రమే సుఖసంతోషాల ననుభవిస్తున్నారని ధనవంతులు పేదలకు అన్యాయం చేస్తూ వారిని దోచుకుంటున్నారని భయభక్తులు హృదయపూర్వకమైనవి కావని భద్రత నిజమైన భద్రత కాదని ప్రవక్త గమనించాడు. పరిస్థితులు ఇలాగే ఉంటే దేవుడు వారిని శిక్షిస్తాడని ప్రవక్త హృదయభారంతో పేర్కొంటూ "న్యాయము స్థిరపరచుడి" అని మనవి చేయడం ఈ గ్రంథంలోని ముఖ్యాంశం.

**విషయసూచిక**

ఇశ్రాయేలు పొరుగుదేశాలమీదికి వచ్చిన శిక్ష 1:1-2:5
ఇశ్రాయేలుమీదికి వచ్చిన తీర్పు 2:6-6:14
అయిదు దర్శనాలు 7:1-9:15

**ఓబద్యా**-పరిచయం

ఈ క్లుప్త గ్రంథం క్రీస్తు పూర్వం 586 సంవత్సరంలో యెరూషలేము పతనానంతర కాలానికి సంబంధించినది కావచ్చు. యూదా దేశానికి చిరకాల శత్రువైన ఎదోము దేశం యూదా దుస్థితిని చూచి సానుభూతి చూపడానికి బదులు సంతోషించి యెరూషలేమును దోచుకొని శత్రువుకు సహాయం చేసింది. ఇశ్రాయేలు శత్రుదేశాలన్నీ శిక్షకు గురైనట్లే ఎదోము కూడా శిక్షకు గురవుతుందని ఓబద్యా ప్రవచించాడు.

**విషయసూచిక**

ఎదోము శిక్ష 1-14 వచనాలు
యెహోవా దినం 15-21 వచనాలు

**యోనా**-పరిచయం

బైబిల్లోని ప్రవక్తల గ్రంథాల్లో కథ రూపంలో ఉన్న ఏకైక గ్రంథం యోనా. దేవుడు యోనాను ఇశ్రాయేలు బద్ధ శత్రువైన అష్షూరు ముఖ్యపట్టణమైన నీనెవెకు వెళ్లమని ఆజ్ఞాపిస్తాడు. అయితే దేవుడు నీనెవెను శిక్షించడని ఆయన నీనెవె ప్రజలను క్షమిస్తాడని నమ్మిన యోనా దేవుడు తనతో చెప్పిన ప్రకారం చేయడు. కొన్ని పరిణామాల తర్వాత యోనా అయిష్టంగానే నీనెవెకు వెళ్లి దేవుని సందేశాన్ని ప్రకటిస్తాడు. యావత్సృష్టిపై దేవునికున్న సంపూర్ణాధి కారాన్ని కృపాప్రేమలను ఈ గ్రంథం వివరిండం గమనార్హం.

**విషయసూచిక**

యోనా పిలుపు, మరియు అవిధేయత 1:1-17
యోనా పశ్చాత్తాపం, మరియు విడుదల 2:1-10
నీనెవె గురించి యోనా సందేశం 3:1-10
నీనెవె మీద దేవుని కృప 4:1-11

**మీకా**-పరిచయం

యెషయా ప్రవక్త సమకాలీనుడైన మీకా ప్రవక్త దక్షిణరాజ్యమైన యూదాలోని గ్రామీణప్రాంతానికి చెందినవాడు. ఉత్తర రాజ్యానికి ఆమోసు దేన్నైతే ప్రవచించాడో అదే యూదాకు కూడా తప్పదనీ మీకా నమ్మాడు. ఎందుకంటే దేవుడు అన్యాయాన్ని సహించడు. భావికాలం గురించి నిరీక్షణాస్పదమైన మరియు స్పష్టమైన సందేశాలు ఈ గ్రంథంలో ఉండడం గమనార్హం.

**విషయసూచిక**

ఇశ్రాయేలుపై మరియు యూదాపై తీర్పు 1:1–3:12

పునరుద్ధరణ, మరియు సమాధానం 4:1–5:15

శిక్ష మరియు నిరీక్షణ 6:1–7:20

**నహూము**–పరిచయం

ఇశ్రాయేలు చిరకాల శత్రువైన అష్షూరు ముఖ్య పట్టణమైన నీనెవె పతనం గురించి నహూము ఈ గ్రంథం వ్రాశాడు. క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దం చివర్లో సంభవిం చిన నీనెవె పతనాన్ని అహంకారంతో క్రూరంగా ప్రవర్తిం చిన దేశంమీదికి వచ్చిన దేవుని శిక్షగా చెప్పవచ్చు.

**విషయసూచిక**

నీనెవెపైకి తీర్పు 1:1–15

నీనెవె పతనం 2:1–3:19

**హబక్కూకు**–పరిచయం

క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దం చివర్లో హబక్కూకు ప్రవచించాడు. శత్రువు బలాధిక్యతతో క్రూరహింస జరిగిస్తున్నప్పుడు ప్రవక్త ఆవేదనతో దేవుణ్ణి "నీవు చూచియు ఎందుకు ఊరకున్నావు?" అని ప్రశ్నిస్తాడు. హబక్కూకు గ్రంథంలోని మిగిలిన భాగమంతా అనీతి మంతులమీదికి వచ్చే శిక్ష గురించిన ప్రవచనం. గ్రంథం చివర్లో దేవుని గొప్పతనం గురించి ప్రవక్తలోని అచంచ లమైన విశ్వాసం గురించిన వర్ణన పద్యరూపంలో కనిపిస్తుంది.

**విషయసూచిక**

హబక్కూకు ఫిర్యాదులు, మరియు యెహోవా జవాబులు 1:1–2:4

అనీతిమంతులపైకి వచ్చే వినాశనం 2:5–20

హబక్కూకు ప్రార్థన 3:1–19

**జెఫన్యా**–పరిచయం

క్రీస్తు పూర్వం ఏడవ శతాబ్దం ద్వితీయార్ధంలో బహుశా యోషీయా రాజు సంస్కరణలకు ఒక దశాబ్దం ముందు జెఫన్యా ప్రవక్త ప్రవచించాడు. యూదా రాజ్యం నిజమైన దేవుణ్ణి విడిచి విగ్రహాలను పూజించినందుకు యూదాపైకి రాబోయే వినాశనం గురించిన ప్రవచనం ఈ గ్రంథంలో కనిపిస్తుంది. యూదానే కాదు, దేవుడు ఇతర దేశాలను కూడా శిక్షిస్తాడు. యెరూషలేము శిక్షకు గురైనప్పటికీ మళ్లీ పునరుద్ధరణ కలుగుతుందనే ఆశాభావం ఈ గ్రంథంలో కనిపిస్తుంది.

**విషయసూచిక**

యెహోవా తీర్పు దినం 1:1–2:3

ఇశ్రాయేలు పొరుగుదేశాలపైకి వచ్చే వినాశనం 2:4–15

యెరూషలేము వినాశనం, మరియు విడుదల 3:1–20

**హగ్గయి**–పరిచయం

క్రీస్తు పూర్వం 520 సంవత్సరంలో హగ్గయి ప్రవక్త ద్వారా యెహోవా సెలవిచ్చిన క్లుప్త సందేశాల సంకలనం ఈ గ్రంథం. దేవుని ప్రజలు చెరనుండి స్వదేశానికి తిరిగి చేరుకున్నారు. యెరూషలేములో ప్రజాజీవనం మెరుగయ్యింది. అయితే దేవాలయం మాత్రం శిథిలాల్లోనే వుంది. దేవాలయాన్ని పునర్నిర్మించాలని, మరియు దేవుడు తన వైపు మళ్లిన ప్రజలకు సమాధానాన్ని క్షేమాన్ని ఆశీర్వాదాన్ని ఇస్తాడని తెలిపే సందేశాలు ఈ గ్రంథంలో వున్నాయి.

**విషయసూచిక**

దేవాలయ పునర్నిర్మాణం గురించి ఆజ్ఞ 1:1–15

ఆదరణ మరియు నిరీక్షణ ఇచ్చే సందేశాలు 2:1–23

**జెకర్యా**–పరిచయం

జెకర్యా గ్రంథంలో రెండు ప్రధాన భాగాలున్నాయి: మొదటిది, 1–8 అధ్యాయాలు క్రీ.పూ. 520 – క్రీ.పూ. 518 మధ్య కాలంలో జెకర్యా యెరూషలేము పునరుద్ధరణ గురించి దేవుని ప్రజల పవిత్రీకరణ గురించి దర్శనాల ద్వారా తెలిపిన ప్రవచనాలను తెలియజేస్తాయి; రెండవది, 9–14 అధ్యాయాలు రాబోయే రక్షకుని గురించి అంతిమ తీర్పు గురించి వివరిస్తాయి.

**విషయసూచిక**

శిక్ష, మరియు నిరీక్షణ గురించిన సందేశాలు 1:1–8:23

ఇశ్రాయేలు పొరుగుదేశాలపైకి తీర్పు 9:1–8

భావికాలంలో క్షేమ సమాధానాలు 9:9–14:21

**మలాకీ**–పరిచయం

మలాకీ గ్రంథం యెరూషలేము దేవాలయ పునర్నిర్మాణం తర్వాత క్రీస్తు పూర్వం అయిదవ శతాబ్దంనాటిది కావచ్చు. ప్రవక్త ప్రజాజీవనంలో కట్టుబాట్లు లేవని అవినీతి పెల్లుబుకుతోందని దైవారాధనలో యథార్థత లేదని చెబ్తూ

దేవుని ప్రజలు వారి యాజకులు దేవుడు తమతో చేసిన నిబంధనను పునరుద్ధరించుకొని ఆయన పట్ల భయభక్తులు కలిగి జీవించాలని కోరుతున్నాడు. దేవుడు తన మార్గాన్ని సరాళం చేయడానికి తన నిబంధనను ప్రకటించడానికి ముందుగా తన దూతను పంపుతాడనే నిరీక్షణాస్పద సందేశంతో పాత నిబంధనలోని చివరి గ్రంథం ముగుస్తోంది.

**విషయసూచిక**

ఇశ్రాయేలు పాపాలు 1:1–2:16

దేవుని తీర్పు, మరియు ఆయన కృప 2:17–4:6

### క్రొత్త నిబంధన – పరిచయం

క్రొత్త నిబంధన బైబిల్లోని రెండవ భాగం. క్రొత్త నిబంధనలోని ఇరవై యేదు పుస్తకాలు పాత నిబంధనలో (యూదు లేఖనాలు) ప్రారంభమైన దేవుని ప్రజల చరిత్రను కొనసాగిస్తాయి. నిబంధన అనే పదం ఒప్పందం అనే అర్థాన్నిచ్చే లాటిన్ పదంనుండి వచ్చింది. దేవుడు ఇశ్రాయేలీయులతో చేసిన నిబంధన గురించి పాత నిబంధన ప్రస్తావిస్తోంది. ఈ నిబంధనకు మూలం మోషే ధర్మశాస్త్రం. దేవునికి విధేయులై ధర్మశాస్త్రానుసారం జీవించేవారే దేవుని ప్రజలు. యేసు కాలానికి సుమారు ఆరు వందల సంవత్సరాల పూర్వం యిర్మీయా ప్రవక్త మరో నిబంధన గురించి ప్రకటించాడు. ఈ నిబంధన అంతఃకరణసంబంధమైన క్రొత్త నిబంధన (యిర్మీయా 31:31–34). క్రొత్త నిబంధన రచయితలు యేసు ద్వారా దేవుడు చేసిన కార్యాన్ని క్రొత్త నిబంధనగా వర్ణించారు (1 కొరింథీ 8:7–13; 9:15–17; 11:25; 12:24–27). ఈ నిబంధనకు వ్రాతపూర్వకమైన నియమాలు మూలం కాదు గాని దేవుని ఆత్మ ద్వారా కలిగే నూతనజీవమే మూలం (2 కొరింథీ 3:6–15; గలతీ 3:10–14).

యేసు అనంతరం సుమారు వంద సంవత్సరాల తర్వాత క్రొత్త నిబంధన గ్రంథంలోని పుస్తకాలను రచించడం జరిగింది. యూదుడు, నజరేతువాసి అయిన యేసు ఈ పుస్తకాల కేంద్రబిందువు. ఈయనే క్రీస్తు (అభిషిక్తుడు), లేక రక్షకుడు (మార్కు 8:29; 14:61,62; లూకా 2:11; యోహాను 20:30,31; అ.కా. 3:18–21).

నాలుగు సువార్తలు (మత్తయి, మార్కు, లూకా, యోహాను) యేసు జీవితాన్ని ఆయన బోధలను వేర్వేరు దృక్పథాలతో వర్ణిస్తాయి. యేసు అనంతరం, వెనువెంటనే తొలి అపొస్తలులు ఆయన సందేశాలను ఎలా ప్రకటించారో అపొస్తలుల కార్యములు వివరిస్తోంది.

క్రొత్త ప్రాంతాల్లో వ్యాపించిన సువార్తను ప్రజలెల్లా అర్థం చేసుకున్నారో ఆ సువార్తను వారెలా అన్వయించుకున్నారో క్రొత్త నిబంధనలోని పత్రికలు తెలియజేస్తాయి. తొలి క్రైస్తవుల అనభవాలను కూడ ఈ పత్రికలు ప్రతిధ్వనిస్తాయి. దేవుడు క్రొత్త భూమిని క్రొత్త ఆకాశాన్ని ఆవిష్కరిస్తాడనే నిరీక్షణతో క్రొత్త నిబంధనలోని చివరి గ్రంథమైన ప్రకటన ముగుస్తోంది.


క్రొత్త నిబంధనలోని పుస్తకాల రచనాకాలాన్ని నిర్దిష్టంగా చెప్పడం సాధ్యం కాదు. పౌలు వ్రాసిన పత్రికల్లో కొన్ని క్రొత్త నిబంధనలోని తొలి రచనలని పలు పండితుల అభిప్రాయం. వాస్తవానికి, సువార్తలు అపొస్తలుల కార్యములు రచన చాలా కాలం తర్వాత జరిగింది. బహుశా మార్కు తొలి సువార్త కావచ్చు. క్రీ.పూ. 70లో యెరూషలేము పతనం తర్వాత మార్కు సువార్తను రచించి వుండవచ్చు.

యేసు, ఆయన శిష్యులు అరమేయ భాషను మాట్లాడినప్పటికీ క్రొత్త నిబంధనలోని కొన్ని పుస్తకాలను నాటి వ్యవహారభాష అయిన గ్రీకులో రచించారు. క్రొత్త నిబంధన రచయితలకు యూదు లేఖనాల గ్రీకు భాషాంతరం సెప్టువజింటు కూడ సుపరిచితమైనదే. క్రొత్త నిబంధనలో ఉదాహరించిన లేఖనాల్లో చాలా భాగం సెప్టువజింటులోనివే. క్రొత్త నిబంధన మూలప్రతులు దాదాపు ఇప్పుడు లేనట్లే. ఇవి చాలాకాలం క్రితమే శిథిలమయ్యాయి. అయితే ఈ ప్రతుల నకళ్లు నాటినుండి నేటి వరకు కొనసాగుతూనే వున్నాయి.

గ్రీకు భాషలోని క్రొత్త నిబంధన పూర్తి తొలి ప్రతి సుమారు క్రీస్తు శకం నాల్గవ శతాబ్దం నాటిది కాగా వీటిలో కొన్ని పుస్తకాల తొలి ప్రతులు క్రీస్తు శకం 125 నాటివి. కాప్టిక్ సిరియా లాటిన్ భాషల్లోనికి చేసిన అనువాదాలు కూడ బైబిలు పండితుల దృష్టిలో ప్రశస్తమైనవే. నేడు మన బైబిలులో క్రొత్త నిబంధనలో ఉన్న ఇరవై యేదు పుస్తకాలు తుది రూపంలోనికి రావడానికి సుమారు మూడువందల సంవత్సరాల కాలం పట్టింది.

**(సశేషం)**

6



బ్రదర్ కె.సామ్రాట్

# మధ్యకాలము

**(ప్రవక్తయైన మలాకీ కాలము నుండి బాప్తిస్మమిచ్చు యోహాను వరకు గల మధ్యకాలములోని యూదుల చరిత్ర)**

కాని ఎలీమియాన్ పార్తియాన్ మరియు బాక్ట్రియాన్ నాయకులు మిత్రిదీయుల మీద పార్థియా రాజుమీద తిరుగుబాటు చేయుచుండగా థెమెత్రియస్ వారిని వెంటాడు సమయంలో సైమన్ తన దేశములో కోటలను నిర్మించుటకు పూనుకొనెను. అక్రా దుర్గము పడగొట్టుటయే కాక దానిని తీసుకొని ఆ దుర్గము ఉన్న పర్వతమును చదునుచేసిరి.

మైత్రిడేటస్ క్రీ.పూ. 141 సం॥లో థెమెత్రియస్‌ను తొలగించి అతనిని బంధీగా తీసుకొని అతనికి తన కుమార్తెయైన రొదగు నాని వివాహమునకు ఇచ్చెను. అందువలన థెమెత్రియస్ భార్యయగు క్లియోపాత్ర కోపముతో సెల్యూషియాలో ఉండిపోయి తనకు తానుగా మరియు రాజ్యమును ఆమె అన్నయైన అంతియోకస్‌కు సమర్పించు కొనెను. క్రీ.పూ. 139 సం॥లో క్రేతునందు ఆమె ఆహ్వానమును అంగీకరించి సిరియా మీద నౌకా దళ సైన్యముతో ప్రవేశించి ట్రైఫాన్ ద్వారా తరుమబడిన వారి వలన బలమునొంది టిఫ్రాన్‌ని ఒరోన్‌టెస్‌కు దగ్గర ఉన్న ఎఫామియాకు తరిమి అక్కడ అతనిని పట్టుకొని చంపెను.

ఆ విధంగా అంతియోకయస్ తన తండ్రి సింహాసనమును సంపాదించెను. సింహాసనము నదిష్టించిన తర్వాత వివిధములైన ఆధిక్యతలను ఇచ్చెదనని ప్రమాణము చేసి సైమన్ సహాయముతోనే సింహాసనమును పొందగలిగెను. కాని ఆ తర్వాత అతనికి శత్రువులు ఎవరూ లేకపోవుట చూచి ఆ వాగ్ధానములన్ని మరచిపోయెను. మరియు యొప్పె, గాజాలను తిరిగి యివ్వమని కోరెను. మరియు వారినుండి వెయ్యి తలాంతులను కోరెను.

దీనికి సమ్మతించుటకు సైమన్ (సీమోను) నిరాకరించెను. అంతియోకయస్ కొంత సైన్యముతో సైమన్‌ను బలవంతము చేయుటకై సీన్‌డబియన్‌ను పంపెను. సైమన్ ప్రస్తుతం ముసలివాడై యుండెను గనుక కుమారులైన యూదా, జాన్ హెర్కనాస్ తండ్రిని శ్రద్ధగా చూచుకొనుచుండిరి. వారు సీమోనును పారిపోవునట్లు చేసి శత్రుసైన్యములో ఎక్కువ భాగమును వెంటాడి చంపిరి.

ఈ సంగతులు జరిగిన తరువాత క్రీ.పూ. 135లో తన అల్లుడైన టోలమీ ద్వారా సైమన్, అతని కుమారులైన యూదా, మత్తియా హత్యగావించబడిరి. ఈ టోలమీని యెరికో ప్రదేశమునకు గవర్నరుగా నియమించినది సైమనే. అయినను యూదయ దేశమును ఏలవలెనను ఆశతో తన మామను, అతని కుమారులను యెరికో పట్టణమునందలి ఒక కోటలో వేడుకలకు రప్పించి వారిని హత్యచేసి, గజరలోనున్న జాన్ హెర్కె నస్‌ను ముట్టడివేయుటకు కొంత సైన్యమును అచ్చటికి పంపెను.

ఈ సంగతి ముందుగా తెలిసికొనిన జాన్ హెర్కెనస్ తనను బంధింప వచ్చిన వారిని చంపి వెంటనే యెరూషలేము వెళ్ళి పట్టణమును, దేవాలయమును స్వాధీనపరచుకొని, తన తండ్రికి వారసునిగాను, యూదులకు మత గురువుగాను, రాజ్యపాలకునిగాను ప్రకటించుకొన్నాడు. ఈ గందరగోళ పరిస్థితులను అంతియోకస్ తనకు అనుకూలముగా మార్చుకొనదలచి గొప్ప సైన్యముతో యూదయకు తరలివచ్చాడు. హెర్కెనస్‌ను యెరూషలేములో ముట్టడించి అత్యంత కఠినమైన షరతులతో శాంతి సంధికి అతనిని

ఒప్పుకొనునట్లు చేసెను. అవేమిటంటే వారు ఎన్నడును ఆయుధములు ధరించరాదు, యెరూషలేమును తిరిగి చక్కచేయరాదు, యూదయ కాక తదితర ప్రాంతములలో నివాసులైన యూదులు కప్పము చెల్లించుటయు యెరికో పట్టణము కట్టుటకు 500 తలాంతుల ధనము చెల్లించుట అను షరతులు విధించెను.

హెర్కెనస్ అంతియోకస్‌తో పార్థియన్ యుద్ధమునకు వెంబడించవలసి వచ్చింది. ఆ సమయములో అతడు అన్ని విషయాలు పరిత్యజించిన వాడయ్యాడు. ఆ సంవత్సరాంతములో అతను తన ఇల్లు చేరాడు.

అంతియోకస్ ఆ శీతాకాలమంతా తూర్పున గడపాలని నిశ్చయించుకొని సైన్యముతో తూర్పువైపునకు ప్రయాణము చేసి వారి విడిదిని వేరువేరుగా దూరంగా ఏర్పాటు చేసాడు. ఈ పరిస్థితిని గమనించిన స్వదేశీయులు ఒక రాత్రి జామున నిద్రిస్తున్న వారందరి గొంతులు కోసి చంపేశారు. నాలుగు లక్షల మంది సైనికులున్న సైన్యములు ఈ మానవ వధను గురించి ఇంటికి వార్త తీసికొని రాగల వాడొకడైనను మిగిలి యుండలేదు. హెర్కెనస్ కూడ వధించబడ్డాడు.

పార్థియా దేశపు రాజైన ఫ్రార్టిస్ అంతియోకస్ వలన చాలా కష్టాలకు గురై తన యొద్ద బంధీగా ఉన్న థెమెత్రియస్ నికనార్‌ను తన రాజ్యమైన సిరియాను వశపరచుకొనుటకు అచ్చటికి పంపి ఈ బాధనుండి విముక్తుడవ్వాలనుకొన్నాడు. ఇంతలో అంతియోకస్ మరణవార్త విని ఆ ఉద్దేశ్యమును మానుకొని ఆలస్యము లేకుండా తనే ఆ సింహాసనమును అధిష్టించాడు.

అతని కౄరమైన రాజ్యపాలన అతని మీద తిరుగు బాటుకు దోహదమైనది. క్రీ.పూ.127లో అలగ్జాండర్ జబీనా అనునతడు అలగ్జాండర్ బాలాస్ కుమారుడనని చెప్పు కొనుచూ, ఈజిప్టు రాజైన టోలమిఫిస్కోన్ యొక్క సహాయంతో యుద్ధమందు జయించి, తూరుదేశమునకు తీసికొని వెళ్ళి అక్కడ అతని చంపెను.

ఈజిప్టు రాజైన టోలమి ద్వారా సిరియా సింహాసనమెక్కిన జబీనా అతనికి లోబడియుండవలెనని కోరినప్పుడు జబీనా తిరస్కరించాడు. అందువలన టోలమి తన కుమార్తె ట్రోఫీనాను నికనార్ కుమారుడైన అంతిఓకస్ గ్రఫినాకు ఇచ్చి వివాహము చేసి, అతనిని సిరియాకు రాజుగా చేసి, జబీనాను వెంబడించి బంధించి చంపెను.

ఈ విప్లవ సంఘటనల మధ్య హెర్కెనస్ సిరియా కాడి నుండి తప్పించుకున్నాడు. ప్రఖ్యాతిగాంచిన బోరిస్ గోపురమును ఒక రాతిమీద నిర్మించాడు. యూదయ సరిహద్దులలోనున్న అనేక పట్టణాలను లోబరుచుకున్నాడు. సమరయులకు ముఖ్య పట్టణమైన షెకెమున క్రీ.పూ. 130లో లోబరుచుకొని, గెరాజీము కొండమీదనున్న దేవాలయమును నాశనము చేసాడు.

క్రీ.పూ. 129లో ఇదూమియ దేశము మీదకు దండెత్తి దానిని లోపరచుకొని వారిని యూదమతము స్వీకరించునట్లు చేసి, ఇదూమియను యూదుల కొరక ఎదోముగా మార్చాడు. తరువాత రోమా సామ్రాజ్యముతో సత్సంబంధములు నెలకొల్పుకొని సెనెటు ద్వారా ఇంతకముందు ఎన్నడును పొందియుండని ఆధిక్యతను ప్రత్యేక అధికారమును సంపాదించెను. తన కుమారులైన అరిస్టోబులస్, అంటిగోనస్ ద్వారా సమరయను ముట్టడివేసి పూర్తిగా నాశనము గావించెను.

ఈ ఘనకార్యముల తర్వాత అంతియోకస్ విదేశ దండ యాత్రల నుండి పూర్తి నెమ్మది అనుభవించెను. ఇంటి వద్ద కూడా ఎటువంటి ఒడిదుడుకులు లేకుండెను.

ఎలియాజరు అను ఒక పరిసయ్యుడు , హెర్కెనస్ యొక్క తల్లి యుద్ధఖైదిగా యుండెను కనుక అతడు ప్రధాన యాజకునిగా కొనసాగవీలులేదని చెప్పసాగెను. పరిసయ్యుల సమస్త శాస్త్రములు హెర్కెనస్ ఎరిగియుండెను.

యోనాతాను అనునొక సద్దూకయుడు ఇతని స్నేహితుడై యుండెను. అతను ఈ పరిస్థితిని ఆధారము చేసికొని హెర్కెనస్‌ను తన గుంపులోనికి లాగుకొనెను. అతను కూడా ఈరిటాయములో హృదయపూర్వకముగా అంగీకరించి పరిసయ్యుల మీద అనేక ఆంక్షలు విధించెను.

**(సశేషం)**



రెవ.డా॥ కె.జోసఫ్

# దేవుని జ్ఞానం అపరిమితమనుటకు ఉదాహరణ

ఇందుకు ఉదాహరణగా – మన రాష్ట్రపతి భవనం నుండి ఒక దృష్టాంతమును చూడవచ్చును.

1. మన రాష్ట్రపతి భవనమును వారు ఢిల్లీనందలి రైసీనా పర్వత ప్రాంతములో కట్టారు.
2. 1012లో ప్రారంభించి – 1929లో పూర్తి చేశారు. 17 సంవత్సరాలు కట్టారు.
3. ఐదువేలమంది శ్రామికులు 24 గంటలు 3 షిఫ్టులుగా పనిచేశారు.
4. 12.50 లక్షల రూపాయలు ఖర్చు చేశారు.
5. రాష్ట్రపతి ఎస్టేట్ 354 ఎకరాల విస్తీర్ణము.
6. అందులో 9 టెన్నిస్ కోర్టులు, ఒక పోలో గ్రౌండ్, ఒక గోల్ఫ్ కోర్టు, క్రికెట్ మైదానం ఉన్నాయి. భవనము యొక్క ప్లింత్ ఏరియా 130 ఎకరాలు. 4 అంతస్తులు. 360 గదులు ఉన్నాయి.
7. భవనంలో ఉద్యోగులు 4000 మంది.
8. నెలకు మెయింటెనెన్స్ ఖర్చు 1కోటి 40 లక్షల రూపాయలు.
9. రాష్ట్రపతి భవనం చూడాలంటే మిలిటరీ సెక్రటరీకి అప్లై చేసుకోవాలి.
10. ఫిబ్రవరి, మార్చి నెలలో సాధారణ పౌరులను చూడనిస్తారు.
11. 360 గదులను చూడనివ్వరు, 3 గదులనే చూడ నిస్తారు. 1) దర్బారు హాలు : జాతీయ అవార్డులు ప్రధానం చేసే హాలు 2) అశోకా హాలు : మంత్రులు ప్రమాణ స్వీకారం చేసే హాలు 3) డైనింగ్ హాలు : 104 మంది ఒకేసారి భోజనం చేయవచ్చును
12. ఇవి గాక మొఘల్ గార్డెన్స్ చూడనిస్తారు.

1) సాధారణ ప్రజలు ఢిల్లీ వెళ్ళి రాష్ట్రపతి భవనములో మూడు గదులు చూచివచ్చి, వారు రాష్ట్రపతి భవనాన్ని చూచి వచ్చామంటారు. 360 గదుల్లో వారు చూసినది మూడు గదులు మాత్రమే! ఇంకా పలుకుబడి గలవారైతే, మరికొన్ని గదులు చూడగలరు.

2) అలాగే, దేవునియందు భయభక్తులు గలవారు, వారు అనుసరించే భక్తిని, నీతినిబట్టి, జీవించే పరిశుద్ధతనుబట్టి, వారు దేవుని మహిమను చూడడము ఆధారపడి ఉంటుంది. పిండి కొలది రొట్టె అన్నట్లు, మనము దేవుడిని ఘనపరచే దాన్నిబట్టి, దేవుని మర్మములను తెలిసికొనడం ఆధారపడి ఉంటుంది.

3) దైవ ప్రత్యక్షత ఏ కొద్దిమందికో పరిమితం కాదు. దేవుడు సర్వమానవాళికి తండ్రి కాబట్టి, ప్రతి ఒక్కరూ ఆయనను ప్రత్యక్షము చేసికొనవచ్చును

4) బైబిలు గ్రంధమందలి భక్తులకు దేవుడు ఎన్నో రహస్యాలు, సత్యాలు బయలుపరచినను, వారికి తెలుపబడనివి ఇంకా ఎన్నో ఉన్నాయి. ఈనాడు మనము కాదూ నీతి, యధార్ధత, పరిశుద్ధత కలిగి దేవుని సేవించ గలిగితే, వారికి తెలియజేయని వాటిని దేవుడు మనకు తెలియజేయవచ్చును.

# నూతన జీవనము

"ఎవడైనను క్రీస్తునందున్న యెడల వాడు నూతన సృష్టి" 2కొరింథీ. 5:17. "సూర్యుని క్రింద నూతమైనదేదియు లేదు" ప్రసంగి 1:9.

ప్రపంచమంతా నూతన సంవత్సర వేడుకలు ఎంతో సంబరంగా జరుపుకుంటున్న సంగతులు మనకందరికీ తెలుసు. అంటే ఎంత డబ్బు తగలేస్తే అంత సంబరమన్న మాట. అయితే ఎందుకు ఈ సంబరము అని అడిగితే ఎవరూ సరైన సమాధానం చెప్పరు. క్రొత్త సంవత్సరము ఏమైనా క్రొత్త విషయాలు మొలకెత్తిస్తుందా?

సూర్యుని క్రింద క్రొత్తది ఏమీ లేదు. మునుపు వుండినదే ఇక ఉండబోవునది. మునుపు జరిగినదే ఇక జరుగబోవునది అని జ్ఞానియైన సొలొమోను ప్రసంగి 1:9లో చెపుతున్నాడు. కనుక ప్రపంచములో క్రొత్తది అంటూ ఏమీలేదు. అయితే యేసుతో సమస్తము నూతనము. క్రీస్తుయేసు నందున్న వాడు నూతన సృష్టి.

అంటే మొదటి ఆదాము హవ్వలు చేయబడిన తరువాత ఇక మరలా సృష్టి జరుగలేదు. ఆ సృష్టి పాపముతో శపితమై మొదటి ఆదాము వలన పాపము ప్రవేశించి మరణము ప్రవేశించినది. అయితే కడపటి ఆదాము అయిన యేసుతో నూతనముగా మరలా సృష్టి ఏర్పడి శాపము తొలగి నిత్యజీవము ప్రవేశించినది. ఇదియే నూతన క్రియ, నూతన మైనది.

యేసుతో అన్ని క్రొత్తవే. ఆయన బోధలు క్రొత్తవి. అప్పటి ప్రజలు ఆయన బోధలు విని ఇదేమి క్రొత్త బోధగా వున్నదే అన్నారు. యేసుతో క్రొత్త జన్మ, క్రొత్త జీవితం, గలతీ. 5:19లోని శరీర కార్యములు లోకములో పాపము ప్రవేశించినప్పటి నుండి ఉన్నవి. అందుకే దేవుడు నరులను వారి అక్రమము విషయములో శారీరులై ఉన్నారు. అని పలికారు. ఆది 6:3. అంటే శరీర కార్యములతో నిండి యున్నదని అర్థము. మొదటి నుండి వున్నవి కనుక అవి ప్రాచీన గుణములు. అందుకే కడపటి ఆదామైన క్రీస్తుతో, దేవుడు సమస్తమును నూతనపరచియున్నాడు. ఒకడు క్రొత్తగా జన్మించితే తప్ప పరలోకరాజ్యములో ప్రవేశించడు. యోహాను 3:3. క్రొత్త జన్మ క్రీస్తుతోనే. పౌలు భక్తుడు, ఈ విధంగా క్రొత్త జన్మను గురించి వ్రాశాడు.

కావున మునుపట్టి (ప్రాచీన) ప్రవర్తన విషయములోనైతే మోసకరమైన దురాశల వలన చెడిపోవు మీ ప్రాచీన స్వభావమును వదలుకొని మీ చిత్త వృత్తియందు నూతన పరచబడినవారై నీతియు యధార్థమైన భక్తియు (క్రొత్త జీవితము) గలవారై దేవుని పోలికగా సృష్టింపబడిన నవీన స్వభావము (క్రీస్తు స్వభావము) ధరించుకొనవలయును (ఎఫెసీ. 4:22-24). అదే క్రొత్త జీవితము. పాత జీవితము గతించితేనే క్రొత్త జీవితము.

గనుక క్రొత్త సంవత్సరము అంటూ ఏమీ ఉండదు. కేవలము కేలండరులో అంకెలు మారటం తప్ప. కానీ నూతన స్వభావము దాని సృష్టించిన వాని పోలిక చొప్పున నడుచుటలోనే క్రొత్తదనము లభిస్తుంది.

క్రొత్తదనములో ప్రవేశించాలంటే పౌలుగారు ఎఫెసీ. 4:25 నుండి 5:12 వరకు వ్రాయబడిన విషయములను, కొలస్సీ 3:2 నుండి 10 వరకు ఉన్న విషయములను జీవితములో పాటించినట్లయితే అదే క్రొత్తదనము, అదే నూతన జీవనము. ఆ విధముగా జీవించుటకు మనకందరికి దేవుడు సహాయపడును గాక! మనుష్యులకు అసాధ్యమైనది దేవునికి సాధ్యము. ఆమెన్.

# మరణము - నిజమా? 1

**- రెవ. ఎ. మత్తయ్య, వినుకొండ**

మరణము – ఈ వార్త వినగానే మనిషిలో ఒక నిరాశ, నిస్పృహ, వైరాగ్యము, భయము, ఆందోళన, నిస్సహాయత, ఆదిగాగల ప్రేరణలు మనస్సున్న ప్రతి మనుష్యుని మస్తిష్కములో కనుపించే సంభవాలు. పై లక్షణాలన్నియు ఒక వ్యక్తిలో కనుపించకపోయిన, కొన్ని ఉత్ప్రేరణలైనా కలుగుట సహజము. ఇందుకుగల కారణాలు కోకొల్లలు. ఒక వ్యక్తి మరణించిన తరువాత సదరు వ్యక్తిని గూర్చి కుటుంబము, బంధవులు, ఆప్తులు, స్నేహితులు, ఇరుగు పొరుగు వారు కూడుట, మరణించిన సదరు వ్యక్తిని గూర్చి విచారించుట మనమందరము ఎరిగిన విషయములే. కుటుంబ సభ్యుల యొక్క విచారము, వారి గాయములు ఎవ్వరూ పూడ్చలేనివిగా ఉంటాయి.

ఇంతటి భయంకర స్థితిని కల్పించే మరణము యొక్క నిజస్థితి ఏమిటి? పరిశుద్ధ గ్రంథము దీనిని గూర్చి ఏమి చెబుతున్నది. ఈ గ్రంథమును పరిశీలించుటకు సమగ్రమైన సారాంశము పొందుకోవాలని అనుకొనేవారు మొదటగా దేవుని యొక్క సృష్టి క్రమమును గూర్చి తెలుసుకోవాల్సి ఉంటుంది.

ఆదికాండము మొదటి మూడు అధ్యాయములలో సృష్టికర్త, పరమ శిల్లి, తండ్రియైన దేవుడు చేసిన అద్భుత సృష్టిని గూర్చిన వివరములు మనము తెలుసుకుందాము. ఇందులో మూడు ప్రక్రియలు కలవు. 1) సృజించుట 2) చేయుట 3) నిర్మించుట–

**1) దేవుడు సృజించుట :** ఆది. 1:1,21,27, ఆది. 2:3,4 వచనములలో వ్రాయబడింది.

**2) దేవుడు చేసెను :** ఆది. 1:7,16,25,26, ఆది. 2:2,3,4 వచనములు.

**3) దేవుడు నిర్మించెను :** ఆది. 2:7,8,19 వచనములు.

సృష్టి నిర్మాణ క్రమములో దేవుడు ఎన్నుకొనిన ఈ మూడు ప్రక్రియలను గూర్చిన వివరములను పరిశీలిద్దాం.

**1) సృజించుట :** 'BARA' 'బారా' అను హెబ్రీ పదము యొక్క తర్జుమా రూపము 'సృజించుట'. సృజించుట అనగా 'ఏమియు లేని స్థితిలో నుండి క్రొత్త దానిని కల్పించుట' 'Made out of nothing' అని చెప్పుకొనవచ్చును. దేవుడు తాను కోరుకొనిన కొన్నింటిన తన వాక్కు ద్వారా ఉనికి లోనికి తెచ్చుట అని భావము. ఉదా:– భూమి, ఆకాశము ఆది. 1:1, ఆకాశ పక్షులు 1:21, నరుడు 1:27, సృజించ బడినవి ('Made out of nothing').

**2) దేవుడు చేసినవి లేదా చేయుట :** 'ASAN' 'ఆసా' అను హెబ్రీ పదము నుండి తీయబడిన పదము 'చేయుట'. మూల భాషయైన హెబ్రీలో దీని భావము : 'ఉన్న పదార్ధమును తీసికొని దానితో మరొక క్రొత్త పదార్ధమును తయారు చేయుట' 'Made out of something'. ఉదా:– చెక్కను తీసికొని కుర్చీని తయారు చేయుట, మట్టితో బొమ్మను తయారు చేయుట. దేవుడు చేసినది – ఆది. 1:7,16,25,26, ఆది. 2:2,3,4. చేయబడినవి – భూమి, ఆకాశము, వాటిలోనున్న సమస్త సమూహమును సంపూర్తి చేయబడెను ఆది. 2:1. ఏలయనగా దేవుడు తాను చేసినట్టియు, సృజించినట్టియు తన పని అంతటి నుండి విశ్రమించెను ఆది. 2:3.

**3) దేవుడు నిర్మించెను :** సృష్టిలోని మూడవ ప్రక్రియ నిర్మాణము లేదా నిర్మించుట. దీని మూలము హెబ్రీ భాషలోని 'YATSAR' 'యాట్సర్'. దీని భావము ఉన్న పదార్ధమును క్రొత్త రూపమునకు మార్చుట, అనగా 'To remodel or to remake something old'. ఉన్న పదార్ధ మును నూతనపరచుట అని అర్ధము. ఆది. 2:7,8,19

వచనములలో నిర్మాణము, నిర్మింపబడినవి చూస్తాము.

ఇప్పటి వరకు దేవుడు చేసిన సృష్టిని అది చేయబడిన విధమును గూర్చి తెలుసుకున్నాము. మానవుడీద కూడ నిర్మింపబడినవాడే. మానవుడు సృష్టిలోని ఒక భాగము. అయినను దేవుడు మానవుని లేక నరుని నిర్మించుటకు ఒక ప్రత్యేకమైన క్రమమును ఎంపిక చేసికొనినట్టుగా చూడగలము.

దేవుడు నరుని నిర్మించి విధమును గూర్చి నేర్చుకుందాం:

**ఆది. 1:26 :** దేవుడు – "మన స్వరూపమందు మన పోలిక చొప్పున నరులను చేయుదము". మనము గమనించదగిన పదము "చేయుదము" అనునది 'ఆసాన్' అను పదము యొక్క తర్జుమా. 'ఆసాన్' అనగా కలిగి ఉన్న పదార్థమును తీసికొని క్రొత్త దానిని తయారు చేయుట అని భావము. "చేయుదము" అనేది చేయాలి అను పదమునకు మూలము. ఇది ఒక తలంపు మాత్రమే. దేవునికి మానవుని లేదా నరుని చేయాలి అనే తలంపు కలిగినది. చేయాలి అని అనుకున్న దేవుడు మనిషని లేదా నరుని నిర్మించాడు.

**ఆది. 2:7 :** "దేవుడైన యెహోవా నేలమంటితో నరుని నిర్మించెను" అని ఉంది. అనగా భూమి నేల అంతకు మునుపే ఏర్పాటు చేయబడి వుండుటను బట్టి నేలమంటిలో కొంత భాగము తీసికొని నరుని చేసెను. ఇట్లు చేయబడిన (బొమ్మ) నరుడు కేవలము ఒక ప్రతిమ మాత్రమేనని గ్రహించాలి. ప్రతిమకు చలనము లేదు, భావోద్రేకముల ప్రదర్శన లేదు. ఇప్పటి నరునికి ఉన్న సహజ గుణ లక్షణములు ఏమియు లేవు. కేవలము అది ఒక బొమ్మ మాత్రమే. జీవము ఏ మాత్రము లేనిది.


ఇక్కడ మట్టి బొమ్మ నిర్మాణము "ఆసా" ప్రక్రియ ద్వారా చేయబడిన ఒక వస్తువు మాత్రమే.

**ఆది. 2:7 :** "దేవుడు వాని నాసికా రంధ్రములలో జీవ వాయువును ఊదగా నరుడు జీవాత్మ ఆయెను". ఇందులో దేవుడు చేసిన పని – జీవ వాయును అందించుట 'breath of life' జరిగిన కార్యము – మట్టిబొమ్మ జీవాత్మగా మారింది. 'Living Soul' నరుడు, నశించ పోయేవాడు, కాని ఆదాము "జీవాత్మ ఆయెను". అనగా జీవించు ఆత్మ అని అర్ధము – 'The living soul' ఆత్మ, మరణము లేనిది.

**ఆదాము నిర్మాణము :–** 1) మట్టిబొమ్మ–ఆసాన్ 'ASAN' చేసెను 2) జీవవాయువు – యాట్సర్ 'YATSAR' – నిర్మించెను. 3) జీవించు ఆత్మ – బారా 'BARA' – సృజించెను. సృష్టిని చేయుటకై దేవుడు ఎన్నుకొనిన మూడు ప్రక్రియలను ఏకము చేసి, తాను నరునిగా నిర్మించిన ఆదామును చేసెను. దీనినిబట్టి ఆదాము నిర్మాణములో మూడు ప్రక్రియలు కలవు.

ఆది. 2:7: నరుడు (ఆదాము) జీవాత్మ ఆయెను. జీవాత్మలో రెండు ధాతువులు ఇమిడి ఉన్నాయి. 1) జీవము 2) ఆత్మ. ఈ రెండును దేవునిలో నుండి నరునికి యివ్వబడినవి. అందువలన నరుడు జీవాత్మగా మారినాడు. జీవము – అనగా మరణము కానిది. ఆత్మ – దేవుని ఆత్మ మరణము లేనిది. ఈ రెండింటి కలయిక నరుడు (ఆదాము) జీవాత్మ. దీనినిబట్టి నరుడుగా సృజించబడిన ఆదాములో మరణ ధాతువు లేకుండుటనుబట్టియు, జీవము, ఆత్మ అను ఈ రెండు ధాతువులు మరణములేని దేవునికి వుండుటనుబట్టి నరుడు సజీవుడు – అనగా మొదట సృజింపబడిన ఆదాము మరణము లేనివాడు, మరణమునకు అతీతుడు. యోబు 33:4 :– దేవుని ఆత్మ నన్ను సృజించెను, సర్వ శక్తుని యొక్క శ్వాసము నాకు జీవమిచ్చెను.

Read Our Internet Edition @
**www.holinessmagazine.com**




# సువార్తలను గురించి...

**గత సంచిక తరువాయి.....**

**మార్కు సువార్త**

నీతి లేక గురి : యేసు దేవుని కుమారుడు రోమీయులకు, రోమా రాజ్య పాలకులకు, యేసుక్రీస్తు మన రక్షణ అనే నావకు నాయకుడుగాను మరియు జయించువానిగాను.

రచయిత: యెరూషలేములో కాపురమున్న మరియ యొక్క కుమారుడు మార్కు యొక్క గృహములోనే ఆది క్రైస్తవ గృహ కూడికలు జరుగుచుండెడివి (అ.కా 12:12). ఆయన రాజ్యమును స్థాపించుటకు పరిస్థితులను సుగమము చేయుట. మరణమునకు సిద్ధమగుట (మార్కు 14:1-72). మరణమునకు లోబడుట (మార్కు 15:1-47) దేవుని రాజ్యమును అంగీకరించుట (ఆత్మీయముగా) మరణమును జయించుట (మార్కు 16:1-14) ఆయన విజయమును ప్రచురించుటకు గాను ఆయన అనుచరులను పంపించుట (మార్కు 16:15-20).

<u>**లూకా వ్రాసిన సువార్త**</u> : (62 క్రీ.శ.లో వ్రాయబడినది).

గురి : యేసు మనుష్యకుమారుడుగాను రక్షకుడుగాను చూపించుట. మానువులను నీతి పదములో నడిపించాలని మనస్సు కలిగినటువంటి గ్రీకు ప్రజలకు ఉద్దేశించి వ్రాయబడినది. గ్రీకు వారు ఎల్లప్పుడును మానవులను నీతి పథంలో నడపించడానికి గాను ఒక పరసంబంధమైన దైవము రావలెనని తలంచెడివారు. కనుక లూకా దానిని ఆధారముగా చేసుకొని మానవుల యొక్క అవసరతలు తీర్చ గలిగిన ఆ దైవమానవుడు యేసుక్రీస్తు అని తన సువార్తలో చెప్పెను. ఆయనే లోక రక్షకుడు.

రచయిత : అపొస్తులుడైన పౌలు యొక్క పరిచర్యలో పాలి బాగస్థుడైన వాడు లూకా (కొలొ 4:14; 2 తిమో 4:11; ఫిలేమోను 24). లూకా గ్రీకు దేశస్తుడు అనుకొనెడి వారు. మరియు ఆయన వైద్యుడు గనుక ఆయన బాగా చదువుకున్న వాడని తెలియపరచబడుచున్నది. లూకా యొక్క రచనాశైలిని గమనించినట్లయితే అతను చాలా ఆలోచనాపరు డని తెలియబడుచున్నది. గ్రీకు ప్రజలు మంచి వేదాంతపరులు గనుక వారిని దృష్టిలో పెట్టుకొని రచించెను. దేవుని కార్యము లను యూదులు అడ్డగించే వారు గనుక మార్కు సువార్తలో చెప్పబడిన చాలా సంగతులను అతడు వ్రాయలేదు. యూదు లకు సంబంధించిన అనేక విషయము లను అతడు ప్రస్తావిం చలేదు లేక కొంచెముగా చెప్పినాడు.

విషయములు : పరిచయ వాక్యములు (లూకా 1:1-4). పరసంబంధమైన మానవునిరాక (లూకా 1:5-4:13). ఆయన బహిరంగ సువార్త ప్రారంభం ముఖ్యంగా గలలియ ప్రాంతములో (లూకా 4:14, 9:50). యెరూషలేమునకు ప్రయాణము (లూకా 9:51-19:28). చివరి దినాలు యేసు క్రీస్తు శిలువ మరణము కూడ (లూకా 19:29-23:55). పునరుత్థానము మరియు ఆరోహణము (లూకా 24:1-53).

<u>**యోహాను సువార్త :**</u> వ్రాయబడిన కాలము క్రీ.శ.80 - క్రీ.శ.90.

సారాంశము : యేసు క్రీస్తయి ఉన్నాడు. ఆయన జీవముగల దేవుని కుమారుడు యోహాను సువార్తను గురించి ఏమని చెప్పబడిందంటే ఆదిమ సంఘము అప్పటికే కలిగి యున్న సువార్త పుస్తకముల యొక్క ఉద్దేశ్యమును బట్టి వ్రాయ బడింది. అన్ని సువార్తలు వ్రాయబడిన పిదప ఆఖరులో అది వ్రాయబడినది. అది సంఘమును ఉద్దేశించి వ్రాయబడినది. మిగిలిన సువార్తలన్నియు దేవునిని తెలిసికోవాలనే తహతహ గలవారైన అన్య ప్రజలనుద్దేసించి వ్రాయబడినవి.

రచయిత : అపొస్తులుడైన యోహాను చేత వ్రాయబడినది.

ఈయన శిష్యులందరిలో యేసు రొమ్మును ఆనుకొనిన శిష్యుడు. ఈయన inner circle అనబడే ముగ్గురులో (యోహాను, పేతురు, యాకోబు). ఒకడు దేవుని విషయాలను చాలా దగ్గరగా ఉండి గమనించినవాడు. పస్కా దినాన్ని ఆచరించే సమయములో యేసు యొక్క రొమ్మును ఆనుకొని అన్ని పరిస్థితులను గమనించినవాడు యేసు తీర్పుకు గురియై ఉన్నప్పుడు ఈ శిష్యుడు ఒక్కడే ప్రభువును అనుసరించు చున్నాడు (యోహా 18:15). యేసు ప్రభువు సిలువ వేయబడినపుడు కూడా ఆయన చెంత ఉన్నవాడు ఈ శిష్యుడు ఒక్కడే, అందువలననే ప్రభువు చివరి సందేశమును ఈయన మాత్రమే పొందినాడు (యోహా 19:25–27). ప్రభువుతో ఉన్న సహవాసము, పరిచర్య మరియు 50 సంవత్సరముల అనుభవముగల దైవ సేవకునిగా మరియు సువార్తికునిగా, యోహానును ఈ సువార్త వ్రాయుటకు పురికొల్పినవి. అందువలనే యేసుక్రీస్తు వ్యక్తిత్వము మరియు ఆయన బోధలు ఎంతో విశిష్టమైయున్నవి.

విషయములు : ప్రస్తావన ఉపోద్ఘాతము మరియు ప్రస్తావించడము (యోహా 1:1–18). యేసు క్రీస్తు బహిరంగ సువార్తసేవ (యోహా 1:19 – 12:50). యేసుక్రీస్తు దేవుని కుమారుడని ఋజువు పరుచుటకుగాను యేసుక్రీస్తు యొక్క బహిరంగ సేవలో ఆయన చేసిన అనేకమైన అద్భుతాలను వ్రాసియుంచినాడు. యేసుక్రీస్తు తన స్వంత శిష్యులకు చేసిన సువార్త పరిచర్య (యోహా 13:17–26). యేసుక్రీస్తు యొక్క శ్రమలు మరియు పునరుత్థానము (యోహా 18:1 – 20:31). ముగింపు మాటలు, వాని సందేశము (యోహా 21:24,25). యేసు క్రీస్తు దైవత్వానికి ఋజువులు : కానా పెండ్లి విందులో నీళ్ళను ద్రాక్షారసముగా మార్చుట యేసు దైవత్వానికి ఋజువు. సహస్రాధిపతి యొక్క కుమారుని బాగు చేయుట రక్షించుటకు యెహోవా హస్తము కురచకాలేదు. బేతెస్థ కోనేటి దగ్గర 38 సంవత్సరములుగా పడియున్న పక్ష వాయువు గల వాని స్వస్థపరచుట (ఎంత కాలము నుండి ఐనప్పటికిని ఆయనకు అధికారము గలదని చెప్పుట) 5000 మందికి ఆహారము పంచి పెట్టుట (ఆయన అపారమైన శక్తి సామర్థ్యములు) నీళ్ళ మీద నడుచుట ఆయన సృష్టి మీద అధికారము గలవాడని ఋజువు పరుచుట. గ్రుడ్డివారికి చూపు కలుగునట్లు బాగు చేయుట (వ్యాధుల మీదను, దురదృష్టముల మీదను) అధికారము గల వాడినని ఋజువు చేయుట. చనిపోయిన లాజరును లేపుట అనగా మరణము మీద అధికారము గలదని ఋజువు పర్చుట. యేసుక్రీస్తు దైవత్వానికి ఇంకా కొన్ని ఋజువులు : యోహా 1:1–5, 14–18, యోహా 15:18–24, యోహా 8:12, యోహా 10:33–38, 11–4, యోహా 11:25–27, యోహా 14:11–11, యోహా 20:26–31, యోహా 11:25–27 పరలోక సంబంధమైన స్వస్థత. అందరిని స్వస్థపరచుట దేవుని చిత్తమా? నన్ను కూడా? ఏదేను వనములో ఆదాము, హవ్వను ఆది మానవుడు పాపములో పడిపోక ముందు భూమి మీద పాపముగాని రోగములు గాని లేవు. ఇది మొదటిగా మానవులను సృష్టించినపుడు దేవుని చిత్తాన్ని తెలియపర్చుతుంది. మానవుని పడిపోయిన తనాన్ని ఆసరా చేసుకొని పాపము ప్రవేశించినది. దాని ద్వారా జబ్బులు, మరణము ప్రవేశించినవి. పడిపోయిన తరువాత స్థితి నుండి కూడ దేవుడు రక్షణ కలుగజేసినాడు. పాత నిబంధనలో దేవుని గుణలక్షణాలు కీర్తనలు 145:1–21. కృప కలిగి యుండుట – అనగా మేలు చేయు ఉద్దేశ్యము కలిగి యుండుట (వ. 8). ఆయన అందరిని ప్రేమించువాడు (వ. 9ఎ). ఆయన కార్యములయందు కనికరము గలవాడు (వ. 9బి). మనమందరము ఆయన చేతిపనియై ఉన్నాము (ఎఫె 2:10). ఆయన చేతిపనులలో భూమి నిర్మాణము ఒక భాగమై యున్నది. ఆయన నన్ను స్వస్థపరచు యెహోవా (నిర్గ 15:26). బైబిల్ ఎక్కడ కూడా చెప్పబడని మాట ఏమిటంటే 'నిన్ను నాశనము చేయు యెహోవా దేవుడను నేనే'యని. పాత నిబంధన కాలములో ప్రజలు దేవుని మీద తిరుగుబాటు చేసి లోబడనొల్లని సమయములలో దేవుడు వారిని శిక్షించి సరియైన మార్గములో పెట్టుటకు కొన్నిసార్లు కఠినమైన శిక్షను అమలు పరచెను. ఈ విధంగా క్రొత్త నిబంధనలోని నాలుగు సువార్తలను గూర్చి మనము క్లుప్తంగా నేర్చుకున్నాము. దేవుడు మిమ్మును దీవించును గాక!



శ్రీమతి రిబ్కా విక్రాంత్

# మనస్సాక్షి

ప్రియ పరిశుద్ధత పాఠకులకు మన ప్రభువును రక్షకుడైన యేసుక్రీస్తు నామమున శుభాభి వందనములు. మీ అందరికి నూతన సంవత్సర శుభాకాంక్షలు.

**1. మనస్సాక్షి యొక్క పని :**

మనస్సాక్షి, ఏది మంచి ఏది చెడు అని చెప్పుటకు రూపొందిచబడలేదు గాని మన యొక్క జ్ఞానము చొప్పున మనము చేసినది మంచిదా లేక చెడ్డదా అని తెలియ పరచును. అది ఎడతెగక నిందించును లేక క్షమించును రోమా 2:15. మన మనస్సాక్షి మనపైన దోషారోపన చేయని యెడల, దేవుని యెదుట మనము ధైర్యముగల వారగుదుము యోహాను 3:19-21. మన క్రియలను బట్టి అది సాక్ష్యము కలిగియుండును రోమా 9:1-3. సత్యము ఎరిగిన ప్రజలు పాపము చేసినప్పుడు వారి మనస్సాక్షి గాయపడును. ఆదాము మరియు హవ్వ ఆది.3:8, దావీదు 1సమూ.24:5, 2సమూ.24:10 సౌలు 1సమూ.24:16-22, 26:21-25, యూదా మత్తయి 27:3-5, హేరోదు మార్కు 6:14-29, పెంతెకోస్తు దినము అప్పటి ప్రజలు అపొ.కార్య.2:37. ఏమైనప్పటికీ, ఒకడు తప్పు బోధించిన యెడల అతడు తప్పు చేస్తూ యెడతెగక మంచి మనస్సాక్షి కలిగి యుండును. ఇక్కడ పౌలు జీవితము మనము చూచినట్లయితే మంచి మనసాక్షి కలిగియుండుట మనం చూస్తున్నాము అపొ.కార్య.23:1, 26:9. అందుచేత పరిశుద్ధ లేఖనములందు వ్రాయబడిన దేవుని చిత్తమును బట్టి మనస్సాక్షి కలిగియుండుటకు అభ్యాసము చేయవలెను.

**2. మంచి మనస్సాక్షి :**

చివరికది, ఉపదేశానుసారముగా మంచి మనస్సాక్షి 1తిమోతి 1:5. నిర్మలమైన మనస్సాక్షి 2తిమోతి 1:3-5, 1పేతురు 3:21 దేవుని యెడల, మనుష్యుల యెడల మన మనస్సాక్షి నిర్ధోషముగా నుండవలెను అపొ.కార్య. 24:16. అన్ని విషయములలో మంచి మనస్సాక్షి కలిగియుండవలెను హెబ్రీ.13:18. మనస్సాక్షినిబట్టి ప్రభుత్వమునకు లోబడియుండవలెను రోమా 13:6. మనస్సాక్షినిబట్టి శ్రమనొందుము 1పేతురు 2:19. మనలను దూషించువారి యెడల మంచి మనస్సాక్షి కలిగియుండవలెను 1పేతురు 3:15,16 తప్పుడు బోధలు, వాటి అభ్యాసము వలన కొన్ని సమయములలో మనస్సాక్షి బలహీనమగును.

**3. చెడ్డ మనస్సాక్షి :**

కొందరు మంచి మనస్సాక్షిని త్రోసివేయుదురు 1తిమోతి 1:19,20. కొందరు వాత వేయబడిన మనస్సాక్షి కలిగియుందురు 1తిమోతి 4:3. కొందరి యొక్క మనస్సాక్షి అపవిత్రపరచబడియున్నది తీతుకు 1:15,16. అట్టివారు తమ హృదయములను కఠినపరచు కొనెదరు ఎఫెసీ.4:17-19, హెబ్రీ.3:13-15.

**4. మనస్సాక్షిని పవిత్రపరచుట :**

పాత నిబంధనలోని బలులు మనస్సాక్షిని పవిత్ర పరచలేకపోయెను హెబ్రీ. 7:18,19 నిర్జీవ క్రియల నుండి క్రీస్తు రక్తము మన మనస్సాక్షిని పవిత్రపరచును హెబ్రీ. 9:14. మనస్సాక్షికి కల్మషము తోచకుండునట్లు హృదయము ప్రోక్షింపబడెను హెబ్రీ. 10:22. నిర్మలమైన మనస్సాక్షి నిమిత్తము బాప్తిస్మము దేవుని కొరకైన విన్నపము 1పేతురు 3:21 క్రైస్తవుల యొక్క మనస్సాక్షి ప్రతిరోజు క్రీస్తు రక్తము ద్వారా పవిత్రపరచబడుచున్నది 1యోహాను 1:7-9. అయితే, ఒకడు బుద్ధిపూర్వకముగా పాపము చేసి, తన మనస్సాక్షిని అణచి వేసిన యెడల అతడు భయంకరమైన శిక్షను పొందును హెబ్రీ. 10:26-31.

**పాఠకులకు గమనిక**

'పరిశుద్ధత' మాసపత్రిక ద్వారా మిమ్మును ఆధ్యాత్మికంగా బలపరచాలని ప్రతినెలా ఎంతో వ్యయప్రయాసలకోర్చి మీకు పంపిస్తున్నాము. పత్రిక కొరకు ప్రతి నెలా మేము దేవుని వైపు చూస్తున్నాము. అయితే పత్రిక మీ యొక్క ఆధ్యాత్మిక జీవితానికి ఎంతగా ఉపయోగ పడుతుందో, మీరు ఎలాంటి మేలులు పొందు తున్నారో మీ ద్వారా తెలిసుకోవాలని మేము ఎంతగానో ఆశిస్తున్నాము. కాబట్టి పత్రిక పొందుతున్న ప్రతి ఒక్కరూ మీ యొక్క స్పందన మాకు 'పోస్టుకార్డు' ద్వారా లేదా ఈ క్రింది ఫోన్ నంబర్లకు ఎస్.యం.ఎస్ ద్వారా తెలియజేయవలసినదిగా ప్రభువు నామమున మిమ్మును కోరుతున్నాము. **-ఎడిటర్**

**9440217726, 9493950969**

## క్రిస్మస్ స్పెషల్ బైబిల్ క్విజ్ జవాబులు

1. యెషయా 7:14 (మత్తయి 1:23)
2. గలిలయలోని నజరేతు నుండి (మార్కు 1:9)
3. మూడు నెలలు (లూకా 1:56)
4. బేత్సయిదా (యోహాను 1:44)
5. అర్కెలా (మత్తయి 2:22-23)
6. అల్ఫయి (మార్కు 2:14)
7. పెనూయేలు (లూకా 2:36)
8. నికోదేము (యోహాను 3:1)
9. ద్వితీయోపదేశకాండము 8:3 (మత్తయి 4:4)
10. దెకపోలి (మార్కు 5:20)
11. నాయీను (లూకా 7:11)
12. యవల పిండితో చేసిన రొట్టెలు (యోహాను 6:9)
13. 42 తరములు (మత్తయి 1:17)
14. గ్రీసు దేశస్తురాలు (మార్కు 7:26)
15. మరియ గురించి మార్తతో (లూకా 10:41,42)
16. నాలుగు దినములు (యోహాను 11:17)
17. పేతురు (మత్తయి 17:24-27)
18. జెబదయి (మార్కు 10:35)
19. బేత్పగే, బేతనియ (లూకా 19:29)
20. కయప (యోహాను 18:14)





# అక్షరయజ్ఞం



శ్రీమతి కె. ప్రసన్న పరాక్రమ్

## బైబిల్ క్విజ్ - 14

సంఖ్యాకాండము 12 నుండి 36 అధ్యాయము వరకు

1. ఇశ్రాయేలీయులు హజేరోతులో నుండి సాగి ఏ అరణ్యములో దిగిరి?
2. యెహోషువకు యొక్క మరో పేరు ఏమిటి?
3. ఇశ్రాయేలీయులు యెహోవాను ఎన్నిసార్లు శోధించిరి?
4. ఒకడు పొరపాటున పాపము చేసిన యెడల పాపపరిహారార్థబలిగా ఏమి తేవలెను?
5. కోరహు తిరుగుబాటు చేసినందుకు వచ్చిన తెగులు వలన ఎంతమంది చనిపోయిరి?
6. అహరోను కఱ్ఱ చిగిర్చి పువ్వులు పూసి ఏ పండ్లుగల దాయెను?
7. లేవీయులు యెహోవాకు ప్రతిష్ఠించు అర్పణమును ఎవరికి ఇయ్యవలెను?
8. శవమునైనను, మనుష్యుని ఎముకనైనను, సమాధినైనను ముట్టువాడు ఎన్నిదినములు అపవిత్రుడైయుండును?
9. అహరోను చనిపోయినప్పుడు ఇశ్రాయేలీయులు ఎంతకాలము దుఃఖము సలిపిరి? (మత్తయి)
10. సంఖ్యా. 21వ అధ్యాయములో పేర్కొనబడిన గ్రంథము పేరేమిటి?
11. బిలాము వెళ్ళు దారిలో యెహోవా దూత ఎక్కడ నిలిచెను?
12. ఇశ్రాయేలీయులను శపించుటకు బాలాకు చివరిగా బిలామును ఎక్కడికి తోడుకొని వెళ్ళెను?
13. ఇశ్రాయేలీయులను బిలాము ఎన్నిసార్లు ఆశీర్వదించెను?
14. ఫీనేహాసు చంపిన వారి పేర్లు ఏమిటి?
15. ఒక నెల మొదలుకొని పైవయస్సు ఉన్న లేవీ మగవారు ఎంతమంది లెక్కింపబడిరి?
16. ఒకడు కుమారులు, కుమార్తెలు లేక మృతిబొందిన యెడల వాని స్వాస్థ్యము ఎవరికి ఇయ్యవలెను?
17. 'మూడుపదియవ వంతులు' అను మాట 28వ అధ్యాయంలో ఎన్నిసార్లు ఉంది?
18. ఇశ్రాయేలీయులు పరిశుద్ధ సంఘముగా ఏ ఏ దినములలో కూడవలెను?
19. సంఖ్యాకాండములో చిన్న అధ్యాయం ఏది?
20. సహస్రాధిపతులు, శతాధిపతులు ప్రతిష్ఠార్పణముగా యెహోవాకు ఎంత బంగారము అర్పించిరి?
21. మోషే 'గిలాదు'ను ఎవరికి ఇచ్చెను?
22. ఇశ్రాయేలీయుల ఐగుప్తు దేశము నుండి బయలుదేరి వచ్చిన తర్వాత ఏ దినమున అహరోను మృతినొందెను?
23. ఎఫ్రాయీమీయుల గోత్ర ప్రధాని ఎవరు?
24. ఒకడు ఆశ్రయపురమునకు పారిపోయిన తర్వాత మోషే ఎంతకాలము అక్కడ నివసింపవలెను?
25. సెలోపెహాదు కుమార్తెల పేర్లు ఏమిటి?

**గమనిక :** ఈ ప్రశ్నలన్నిటికి సమాధానాలు బైబిలు నుండి గ్రహించవచ్చును. మీరు ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొనటం ద్వారా బైబిలు జ్ఞానమును సంపాదించాలన్నదే మా ఉద్దేశ్యం. కావున ప్రతి ఒక్కరూ ఈ బైబిల్ క్విజ్‌లో పాల్గొని బైబిలు జ్ఞానము సంపాదించటంతో పాటు బహుమతులు గెలుపొందవలసినదిగా కోరుచున్నాము.